


గోవిందా.. ఇంత ఘోరమా..!

రోడ్డు ప్రమాదంలో నలుగురి దుర్మరణం

- శ్రీవారికి పుట్టు వెంట్రుకలు సమర్పించి వస్తుండగా.. రోడ్డు పక్కన ఆగిన లారీని ఢీకొన్న టెంపో ట్రావెలర్
- తల్లీకొడుకు, కుటుంబ సభ్యురాలు, డ్రైవర్ మృత్యువాత
- మరో 11 మందికి గాయాలు.. నలుగురి పరిస్థితి విషమం
- బాధితులు గుడిబండ మండలం కుంబరనాగేపల్లి గ్రామస్థులు



ఆస్పత్రి ఆవరణలో విలపిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు



ప్రమాదంలో పూర్తిగా దెబ్బతిన్న టెంపో ట్రావెలర్

శ్రీనివాసుడి భక్తులను రోడ్డు ప్రమాదం కబలించింది. ముద్దుల కొడుకు పుట్టు వెంట్రుకలను స్వామివారికి సమర్పించి తిరిగి వస్తూ.. ఆ తల్లి.. కన్నకొడుకును ఒడిసి పట్టుకుని దివికి ఏగింది. రెండేళ్ల క్రితం ప్రసవించిన ఆమె.. కొడుకు బాగోగులను చూసుకునేందుకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి రాజీనామా చేసింది. భర్తతో కలిసి బెంగళూరులో ఉంటూ.. తిరుమల వేంకటేశ్వరుడి మొక్కు తీర్చుకునే క్రమంలో స్వగ్రామానికి వచ్చింది. బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు అందరూ రెండు వాహనాలలో ఆనందంగా వెళ్లారు. మొక్కు తీర్చుకుని, స్వామివారిని దర్శించుకుని.. తిరిగి వస్తుండగా.. రోడ్డు పక్కన ఆగిన సిమెంటు లారీని వారు ప్రయాణిస్తున్న వాహనం వేగంగా ఢీకొట్టింది. ప్రమాద స్థలంలోనే తల్లి ప్రేమకుమారి, చిన్నారి అథర్వ మృతిచెందారు. మరో ఇద్దరు మడకశిర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందే లోగా కన్నుమూశారు. వాహనంలో ఉన్న 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.



అథర్వతో తల్లి ప్రేమకుమారి (ఫైల్)

వివరాలు 7, మెయిన్‌లో...

మీనం.. మేషం..!

మెగా పీటీఎం గొడవపై నివేదిక జాప్యం

డీఈఓ అడిగినా స్పందించని డిప్యూటీ..?

వైఎస్సార్ టీఏ నేత అశోక్‌ను కాపాడే యత్నం

అనంతపురం విద్య, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ అధికారుల వింత పోకడ కొనసాగుతోంది. పాఠశాలల్లో జరిగే చిన్న చిన్న పొరపాట్లకే షోకాజ్ నోటీసులు, సస్పెన్షన్లు అంటూ హడావుడి చేసే అధికారులు.. వైఎస్ఆర్‌టీఏ నాయకులు ఏం చేసినా చర్యలు తీసుకోవడంలేదు. వారిపై ఎనలేని ప్రేమ.. వల్లమాలిన అభిమానం చూపుతున్నారు. కూటమి ప్రభుత్వ కార్యక్రమాలపై విద్యార్థుల ఎదుటే ఇష్టారాజ్యంగా మాట్లాడిన నాయకుడిపై ఎలాంటి చర్యలు లేకపోవడం దీనికి నిదర్శనం. మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో వైఎస్ఆర్ టీఏ రాష్ట్ర నాయకుడు అశోక్‌కుమార్ రెడ్డి నోటి కొచ్చినట్లు మాట్లాడారు. ఆ ఘటనకు సంబంధించి స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. ఇది జరిగి 15 రోజులైనా విద్యాశాఖ ఉలుకూ పలుకు లేకుండా ఉంది. అశోక్ కుమార్ రెడ్డిని చర్యల నుంచి తప్పించేందుకు అధికారులు శాయశక్తులా ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

కాపాడుదామనే..

తాటిచెర్ల హైస్కూల్‌లో మెగా పీటీఎం సందర్భంగా ఈ నెల 7న తీవ్ర వాగ్వాదం జరిగింది. తల్లిదండ్రులు, విద్యార్థుల ఎదుటే వైఎస్ఆర్ టీఏ నాయకుడు ప్రభుత్వ పథకాన్ని విమర్శించారు. 'పేరెంట్స్‌కు అన్నం పెట్టేందుకు రూ.10 వేలు ఇచ్చారా..? యా గవర్నమెంట్ ఇచ్చింది..? ఎంత ఇచ్చింది..? చెప్పండి..' అని తరగతి గదిలో గట్టి గట్టిగా అరిచారు. 'చికెన్లు, పొట్టేళ్లు కోసి పెడుతారా..? ఏందో అంతా ఓవరాక్షన్' అని తల్లిదండ్రులను హేళన చేశారు. ఈ వ్యవహారంపై ఆంధ్రజ్యోతిలో కథనాలు రావడంతో అధికారులు విచారణకు ఆదేశించారు. స్పెషల్ బ్రాంచ్ పోలీసులు సైతం 48 గంటల్లోనే విచారించి.. జరిగింది నిజమేనని నిర్ధారణకు వచ్చారు. విచారణ అధికారిగా డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు ఈ నెల 11న పాఠశాలకు వెళ్లి విచారించారు. డీఈఓకు నివేదిక ఇస్తానని ఈ నెల 16న తెలిపారు. కానీ ఇంతవరకూ నివేదిక ఇవ్వలేదు. ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. పైగా ఈ వ్యవహారాన్ని పక్కదారి పట్టించేందుకు టైం టేబుల్ అమలు కావడం లేదు, గంట కొట్టడంలేదు వంటి అంశాలను తెరపైకి తెస్తున్నారని సమాచారం. నివేదిక ఇవ్వాలని డీఈఓ అడుగుతున్నా.. అదిగో.. ఇదిగో అంటున్నారని సమాచారం. అశోక్ వ్యవహారంపై ఇప్పటికే విద్యాశాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదులు వెళ్లాయి. అయినా జిల్లా విద్యాశాఖ అధికారులలో కదలిక లేకపోవడం విస్తుగొలుపుతోంది.



7న జరిగిన గొడవలో అశోక్ (ఫైల్)

బీటీపీకి శాశ్వత పరిష్కారం

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

గుమ్మఘట్ట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): భైరవాన్‌తిప్ప ప్రాజెక్టుకు ఐదేళ్లలో శాశ్వత పరిష్కారం చూపి, రైతుల కళ్లల్లో ఆనందాన్ని చూస్తామని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. బీటీపీ కమిటీ ఎన్నికలకు శనివారం ఆయన హాజరయ్యారు. ప్రాజెక్టు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా కలుగోడుకు చెందిన కాలవ నాగరాజు, ఉపాధ్యక్షుడిగా బ్రహ్మసముద్రం మండలం బుడిమేపల్లికి చెందిన సుభాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కాలవ మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం రైతులకు మోసం చేసిందని విమర్శించారు. బీటీపీ కోసం సీఎం చంద్రబాబు రూ.968 కోట్లు మంజూరు చేస్తే వైసీపీ నాయకులు రూ.150 కోట్లతో నిర్మిస్తామని హామీ ఇచ్చి విస్మరించారని విమర్శించారు. అభివృద్ధి పనులను అర్థంతరంగా ఆపేసి దుర్మార్గంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సీఎం చంద్రబాబు ప్రాజెక్టు పూర్తికి చర్యలు చేపట్టారని అన్నారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు, తాను పలుమార్లు ముఖ్యమంత్రికి దృష్టికి తీసుకెళ్లి నిధులను సాధించామని అన్నారు. ప్రస్తుతం కుడి, ఎడమ కాలువల మరమ్మతులు, ప్రాజెక్ట్ అభివృద్ధి పనులకు రూ.1.64 కోట్లు మంజూరయ్యాయని అన్నారు. కుడికాలువ మరమ్మతులకు రూ.26.5 లక్షలు, ఎడమ కాలువ మరమ్మతులకు రూ.66 లక్షలు, విద్యుత్ సరఫరా, గేట్ల ఆధునికీకరణ తదితర పనులకు రూ.71.63 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ గుమ్మఘట్ట మండల కన్వీనర్ గిరిమల్లప్ప, బ్రహ్మసముద్రం మండల కన్వీనర్ శ్రీరాములు, క్లస్టర్ ఇన్‌చార్జి కాలవ సన్నన్న, జనసేన ఇన్‌చార్జి మంజునాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైనవారికి డిక్లరేషన్‌ను అందిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ



గేట్ల మరమ్మతులకు భూమి పూజ చేస్తున్న పరిటాల సునీత

పేరూరు ప్రాజెక్టుకు నీరు తెస్తాం

ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పేరూరు అప్పర్ పెన్నార్ ప్రాజెక్టుకు నీటిని తీసుకురావడమే ధ్యేయమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ప్రాజెక్టు కమిటనీ శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పేరూరు, మద్దలచెరువు, గాండ్లపర్తి, తగరకుంట, పాలచెర్ల సాగునీటి సంఘాల అధ్యక్షులు పేరూరు ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పేరూరుకు చెందిన కురుబ కోటే లక్ష్మీనారాయణరెడ్డిని చైర్మన్‌గా, బోగినేపల్లికి చెందిన కెనకలపాటి లక్ష్మన్నను వైస్‌చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఇరిగేషన్ శాఖ ఈఈ శ్రీనివాసులు, డీఈ ఉమామహేశ్వరరెడ్డి ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఎమ్మెల్యే వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేసి, అభినందించారు. గతంలో పేరూరు ప్రాజెక్టుకు వర్షపు నీరు వచ్చినా వృథా చేశారని, గేట్లు తెరిచేందుకు వెళ్లి విరగ్గొట్టారని అన్నారు. ఈ సారి పేరూరు ప్రాజెక్టు మరమ్మతు పనులు పూర్తి చేసి, హంద్రీనీవా నీటితో నింపుతామని అన్నారు. అనంతరం ప్రాజెక్టు గేట్ల మరమతు పనులకు ఆమె భూమి పూజ చేశారు. గేట్ల మరమతుల కోసం ప్రభుత్వం రూ.1.21 కోట్లు విడుదల చేసింది.

డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జి కొనసాగింపు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ శివనారాయణశర్మను మరో ఆరు నెలల పాటు కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 27 నుంచి ఆరు నెలలు, లేదా అంతకు ముందే ఎన్నికలు నిర్వహిస్తే.. అంతవరకూ ఆయన పర్సన్ ఇన్‌చార్జిగా కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గ్రావెల్ దందాపై మరో కేసు



గ్రావెల్‌ను దోచేసిన చిన్నపేట ఆంజనేయస్వామి మాన్యం

యాడికి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు గ్రావెల్ దందాపై యాడికి పోలీస్‌స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. చిన్నపేట ఆంజనేయస్వామి మాన్యంలో మట్టిని అక్రమంగా తరలించారని ఈఓ దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొంబాయి రమేష్‌నాయుడు, ఆయన బావమరిది సతీష్‌నాయుడుపై కేసు నమోదు చేశామని సీఐ ఈరన్న శనివారం తెలిపారు. సర్వే నంబరు 753-1లో చిన్నపేట ఆంజనేయస్వామి మాన్యంలో అనుమతి లేకుండా వీరిద్దరూ ఈ ఏడాది జనవరి 31కి ముందే మట్టిని అక్రమంగా తరలించారని ఫిర్యాదు అందింది. ఈ మట్టి విలువ సుమారు రూ.5లక్షల వరకు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. 220 కేవీ విద్యుత్ టవర్ చుట్టూ మట్టిని తవ్వినందుకు ఇప్పటికే వీరిపై ఒక కేసు నమోదైంది.

నేమకల్లు అంజన్నకు విశేష పూజలు

బొమ్మనహాళ్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి వారికి శనివారం విశేష పూజలు జరిగాయి. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు, సంతోష్‌కుమార్ చార్యులు పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం, నిర్మాల్యవిసర్జన, విష్ణుపారాయణం, అష్టోత్తరం నిర్వహించి స్వామి వారి మూలవిరాట్‌కు పుష్పాలంకరణ చేసి, నైవేద్యం సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ నరసింహారెడ్డి, ఓబన్న తదితరులు పాల్గొన్నారు.



పుష్పాలంకరణలో ఆంజనేయస్వామి



ఈఓకు వెండి కిరీటాన్ని అందజేస్తున్న భక్తులు

స్వామి వారికి వెండి కిరీటం అందజేత

ఉరవకొండ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామికి గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన జీ. శ్రీరాములు, ఓబయ్య కుటుంబసభ్యులు వెండి కిరీటాన్ని సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ఈఓ రమేష్ బాబుకు శనివారం ఈ కిరీటాన్ని అందజేశారు. దీని విలువ రూ.లక్ష ఉన్నట్లు భక్తులు తెలిపారు. నూతన రథం నిర్మాణానికి అనంతపురానికి చెందిన భక్తుడు శ్రీరాములు రూ.1.1లక్షలు విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ద్వారకనాథాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పల్లకి సేవ

పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకి సేవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామి వారిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు.

ధ్యానంతో ఆరోగ్యం

అంతర్జాతీయ ధ్యానదినోత్సవంలో ఎంపీ అంబికా

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చిన్నతనం నుంచే ధ్యానం చేయడం అలవర్చుకోవాలని, ధ్యానంతో మనసు, శరీరం ఆరోగ్యంగా ఉంటాయని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని శనివారం ఉదయం నగరం లోని ఒకటో రోడ్డు కాశీ విశ్వేశ్వరదేవాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ శారీరక, మానసిక ఉల్లాసం, ఆరోగ్యానికి ధ్యానం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ప్రతి రోజు ప్రతి ఒక్కరూ కనీసం ఒక గంటైనా ధ్యానం కోసం కేటాయించాలన్నారు. వివేకానందయోగా కేంద్రం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, బ్రహ్మ విశ్వకుమారి సంస్థ ప్రతినిధి శార, డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా, అంతర్జాతీయ ధ్యానదినోత్సవాల గురించి వివరించారు. అనంతరం గంటపాటు ధ్యానం చేశారు. కార్యక్రమంలో వివేకానంద యోగా కేంద్రం, పతంజలి యోగా సమితి, రామకృష్ణ ప్రచార సమితి, ప్రజాపిత బ్రహ్మకుమారీస్, ఈశ్వరీయ విశ్వవిద్యాలయం, హార్ట్‌ఫెల్‌నెస్ మెడిటేషన్ ఇనిస్టిట్యూట్, పిరమిడ్‌ధ్యాన కేంద్రం, సత్యసాయి ధ్యానమండలి, ఆర్ట్‌ఆఫ్ లివింగ్, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

న్యూస్‌బాక్స్

రేపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

అనంతపురం విద్య, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ల కోసం అర్హతలున్న మున్సిపల్ టీచర్ల సర్టిఫికెట్లను సోమవారం పరిశీలించనున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ స్కూళ్లలో పనిచేస్తూ ప్రమోషన్లకు అర్హత లున్న ఎస్‌జీటీల ఫైనల్ సీనియారిటీ జాబితా సిద్ధం చేశామన్నారు. 1:5 నిష్పత్తిలో జాబితాను సిద్ధం చేసి డీఈఓ బ్లాగ్‌లో ఉంచినట్లు తెలిపారు. జాబితాలోని టీచర్లు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు సర్వీస్ రిజిస్టర్లతో సోమవారం ఉదయం 11 గంటలకు డీఈఓ ఆఫీస్‌కు హాజరు కావాలని సూచించారు.

వసూళ్లు పూర్తి చేయండి

మూడు నెలలే సమయం ..!

మార్కెట్ ఫీజు వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించండి: జేడీ

అనంతపురం రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మరో మూడు నెలల్లో ఆర్థిక సం వత్సరం ముగుస్తుంది. ఆలోగా మార్కెట్ కమిటీలకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని మార్కెటింగ్ శాఖ ఆర్‌జేడీ రామాంజనేయులు పేర్కొన్నారు. జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ కార్యాలయంలో శనివారం ఆయన అనంతపుం జిల్లా ఏడీ సత్యనారాయణ చౌదరితో కలిసి ఉ మ్మడి జిల్లా మార్కెటింగ్ శాఖ కార్యదర్శులతో మార్కెట్ కమిటీల ఫీజు వసూళ్లపై సమీక్షించారు. కమిటీల వారిగా నిర్దేశిత లక్ష్యాలు..వసూళ్ల గురించి అధికారులతో ఆరాతీశారు. ఫీజు వసూళ్లు మందకొండిగా సాగుతున్నాయన్నారు. ప్రత్యేక దృష్టి సారించి వసూళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరం అనంతపురం జిల్లాలోని మార్కెట్ కమిటీలకు రూ.12.06కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించినట్లు ఆర్‌జేడీ పేర్కొన్నారు. నవంబరు వరకు రూ.9కోట్లు వసూలైనట్లు వెల్లడించారు. ఫీజు వసూళ్లలో అనంతపురం, శింగనమ ల కమిటీలు బాగానే ఉన్నాయన్నారు. రా ప్తాడు, గుత్తి కమిటీలు వసూళ్లలో వెనుకబడ్డాయన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో నూ వెనుకబడే ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు లక్ష్యాలపై ప్రత్యేక ప్ర ణాళికలు రూపొందించుకుని వసూలు చేయాలని ఆదేశించారు.

15 మందికి ఉత్తమ అవార్డులు

అనంతపురం అర్బన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని 15 మంది వ్యవసాయ అధికారులను ఉత్తమ అవార్డులకు ఎంపిక చేశారు. అనంతపురం ఏడీఏ రవి, కళ్యాణదుర్గం ఏడీఏ యల్లప్ప, రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్, పెనుకొండ ఏడీఏ స్వయంప్రభ, ధర్మవరం ఏడీఏ కృష్ణయ్య, మండల వ్యవసాయ అధికారులు సోమశేఖర్, సుధాకర్, కాత్యాయని, సాయికుమార్, ముస్తాఫా, తిమ్మప్ప, సురేంద్రనాయక్, సతీష్ బాబు, నరసింహులు, లీలా వసుంధర ఉత్తమ అధికారులుగా ఎంపికయ్యారు. ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న మరో 12 మంది వ్యవసాయ శాస్త్రవేత్తలు ఉత్తమ అవార్డులకు ఎంపికయ్యారు. ఆ అధికారులకు ఈనెల 23న జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉరవకొండలోని ఉరగాద్రి కల్యాణ మండపంలో అవార్డులు ప్రదానం చేస్తామని సంస్థ నిర్వాహకులు ఓబులేసు తెలిపారు.

సీపీఎం సభలకు సన్నద్ధం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎర్రజెండాలు రెపరెపలాడుతున్నాయి. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 23, 24వ తేదీల్లో గుత్తిరోడ్డులోని ఎన్ఎస్ గ్రాండ్‌లో జిల్లా మహాసభలు నిర్వహించనున్నారు. దాదాపు 11 సంవత్సరాల తర్వాత అనంతపురం వేదికగా మహాసభలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం నుంచే ఏర్పాట్లకు ఆ పార్టీ నాయకులు సమాయత్తమయ్యారు. మహాసభల సూచికగా నగరంలోని క్లాక్‌టవర్ కూడలితోపాటు వివిధ ప్రధాన కూడళ్లలో సీపీఎం జెండాలను కడుతూ ఎరుపుమయం చేస్తున్నారు. మహాసభల సన్నాహకంగా ఆదివారం వందలాది బైక్‌లతో ర్యాలీ నిర్వహించనున్నారు. మహాసభలకు అన్నివర్గాల వారు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి పిలుపునిచ్చారు.

రేపటి నుంచి 'ఓపెన్' ఫీజుల చెల్లింపు

అనంతపురం విద్య, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు ఈ నెల 23 నుంచి వచ్చే నెల 10 వరకూ ఫీజు చెల్లించవచ్చునని డీఈఓ ప్రసాద్‌బాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 23 నుంచి 31వరకూ, ఒక సబ్జెక్టుకు రూ. 25ల ఫైన్‌తో జనవరి 1 నుంచి 4 వరకూ, రూ.50ల ఫైన్‌తో జనవరి 5 నుంచి 8 వరకూ, తత్కాల్ రుసుంతో జనవరి 9 నుంచి 10 వరకూ ఫీజులు చెల్లించవచ్చునన్నారు.

హాట్‌సీట్..!



కంబదూరు సీడీపీఓ పోస్టుకు డిమాండ్

గుట్టుగా నలుగురి ప్రయత్నం

భారీగా ఆదాయం ఉండటంతోనేనా...?

గతంలో మాజీ మంత్రి అండతో లక్షల్లో అవినీతి

కళ్యాణదుర్గం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కంబదూరు ఐసీడీఎ‌స్‌లో సీడీపీఓ పోస్టుకు భారీ డిమాండ్ ఏర్పడింది. ఈ పోస్టుకు నలుగురు పోటీ పడుతు న్నారు. ఇక్కడ సీడీపీఓగా పనిచేసిన వనజా అక్కమ్మ ఏపీడీగా ఉద్యోగోన్నతిపై ఈ నెల 11న రిలీవ్ అయ్యి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ఈ సీడీపీఓ పోస్టు దక్కించుకునేందుకు నలుగురు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

అతి పెద్ద ప్రాజెక్టుగా కంబదూరు

కళ్యాణదుర్గం నియోజకవర్గంలోనే అతి పెద్ద ఐసీడీఎస్ ప్రాజెక్టుగా కంబదూరు ఉంది. ఈ ప్రాజెక్టు పరిధిలో 198 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. కంబదూరు, కుందుర్పి, శెట్టూరు మండలాలు ఈ ప్రాజెక్టు పరిధిలోకి వస్తాయి. పెద్ద ప్రాజెక్టు కావడంతో నిధులు కూడా భారీగానే వస్తుంటాయి. దీంతో అక్రమార్జనకు అవకాశం ఉంటుందనే ఉద్దేశ్యంతో సీడీపీఓ పోస్టు కోసం పలువురు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఆ పోస్టు దక్కించుకునేందుకు వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న సీడీపీఓలు గుట్టుగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. వీరిలో శశికళ, యల్లమ్మ, నాగమణితో పాటు మరో సీడీపీఓ తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. కంబదూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో భారీగా ఆదాయ మార్గాలు ఉండటంతోనే ఇక్కడి సీడీపీఓ పోస్టుకు డిమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రానికి దూరంగా ఉండటం, కర్ణాటకకు సమీపంలో ఉండటంతో ఈ ప్రాజెక్టు గురించి ఉన్నతాధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో ఇక్కడ గతంలో పని చేసిన కొందరు అడ్డూ అదుపు లేకుండా అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టుల భర్తీల్లో లక్షలాది రూపాయలు చేతులు మారాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ అవినీతి ఏ స్థాయిలో చేసినా అడిగే వారే లేరన్న విమర్శలు బహిరంగంగా వినిపిస్తుంటాయి.

వైసీపీ పాలనలో భ్రష్టుపట్టిన ప్రాజెక్టు

వైసీపీ పాలనలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిగా ఉష శ్రీచరణ్ పనిచేసిన కాలంలో ఈ ప్రాజెక్టు భ్రష్టు పట్టిపోయిందనే విమర్శలు ఉన్నాయి. మంత్రి అండతో ఇష్టానుసారం పోస్టులను భర్తీ చేశారన్న ఆరోపణలు వినిపించాయి. అప్పట్లో ఆ ఐసీడీఎస్ కార్యాలయం దందాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయింది. అక్కడ పనిచేసే అధికారి ఆడిందే ఆట, పాడిందేపాటగా సాగి ంది. అడిగే వారు లేరని దర్జాగా పోస్టులను అమ్మేసుకున్నారు. హెల్పర్లకు ప్రమోషన్ కల్పిస్తూ, ఇష్టానుసారంగా అక్రమ వసూళ్లకు తెరలేపారు. ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే ఆ పోస్టులను భర్తీ చేశారు.

ఒక్కో పోస్టుకు లక్షల్లో వసూలు

వైసీపీ పాలనలో అంగన్‌వాడీ పోస్టుల భర్తీలో భారీగా అక్రమాలు జరిగాయి. ఒక్కో పోస్టుకు రూ.లక్ష నుంచి రూ.2.50 లక్షల వరకు వసూళ్లు చేసినట్లు తెలిసింది. అధికారితో ఓ జూనియర్ అసిస్టెంట్ కుమ్మక్కై పోస్టులను భర్తీ చేయడంలో ప్రధాన పాత్ర పోషించినట్లు సమాచారం. ఆ అక్రమ వసూళ్లను వీరిద్దరూ వాటాలు వేసుకుని పంచుకున్నట్లు తెలిసింది. వైసీపీ హయాంలో ప్రశ్నించే వారే లేరన్న ధీమాతో పోస్టులను ఎడాపెడా పోస్టులు భర్తీ చేసేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ఈ అక్రమ వసూళ్ల తతంగం ఎక్కడికి దారి తీస్తుందోనని వారు ఆందోళన చెందుతున్నారు.

జిల్లా కేంద్రం నుంచి వచ్చిపోతున్న సూపర్‌వైజర్లు

కంబదూరు ఐసీడీఎస్ కార్యాలయానికి సూపర్‌వైజర్లు ప్రతి రోజూ జిల్లా కేంద్రం వచ్చి పోతుంటారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడుతోంది. ఈక్రమంలోనే అంగన్‌వాడీల పనితీరు అస్తవ్యస్తంగా మారింది. ఈ ప్రాజెక్టు పరిధిలో పనిచేసే సూపర్‌వైజర్లు విధులకు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు పోతారో తెలియని పరిస్థితి. ఈ ఐసీడీఎస్ కార్యాలయానికి వచ్చే నిధులన్నీ పక్కదారి పడుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఈ కార్యాలయ పనితీరుపై నిఘా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

హెచ్చెల్సీ చైర్మన్‌గా కడప జోగిరెడ్డి

వైస్ చైర్మన్‌గా జిల్లాకు చెందిన కేశవరెడ్డి



హెచ్చెల్సీ ప్రాజెక్ట్ కమిటీ సభ్యులతో బీటెక్ రవి, వెంకటశివుడు యాదవ్ తదితరులు



చైర్మన్ జోగిరెడ్డి, వైస్ చైర్మన్ కేశవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఊహించినట్లుగానే తుంగభద్ర ప్రాజెక్ట్ ఎగువ కాలువ (టీబీపీ హెచ్చెల్సీ) కమిటీ ఎన్నికైంది. కడప జిల్లాకు చైర్మన్, అనంతపురం జిల్లాకు వైస్‌చైర్మన్ పదవులు దక్కాయి. రెండేళ్ల పాటు ఒకరు, మరో మూడేళ్ల పాటు మరొకరు పదవుల్లో కొనసాగేలా పరస్పర అంగీకారంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని హెచ్చెల్సీ లోక్ డివిజన్ కార్యాలయంలో శనివారం హెచ్చెల్సీ ప్రాజెక్ట్ కమిటీ ఎన్నిక నిర్వహిం చారు. హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అనంతపురం జిల్లాలోని 5డిస్ట్రిబ్యూటరీ కమిటీల చైర్మన్‌లు హెచ్ఎల్ఎంసీ కొండాపురం కేశవరెడ్డి, మిడ్‌పెన్నార్ సౌత్‌కెనాల్ డీసీ(డిస్ట్రిబ్యూటరీ కమిటీ) కొర్రపాటి శేఖర్, మిడ్‌పెన్నార్ నార్త్ కెనాల్ డీసీ రాజారెడ్డి, తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ డీసీ కుమెత ప్రమీలమ్మ, గుంతకల్లు బ్రాంచ్‌కెనాల్ డీసీ బొమ్మయ్యగారి మారయ్య హాజరయ్యారు. కర్నూలు జిల్లా ఆలూరు బ్రాంచ్ కెనాల్ డీసీ నగరడోన కిష్టప్ప హాజరయ్యారు. కడప జిల్లా నుంచి కసనూరు డీసీ మారెడ్డి జోగిరెడ్డి, సింహాద్రిపురం డీసీ ఎర్రంరెడ్డి సూర్యశేఖర్‌రెడ్డి, వేంపల్లి డీసీ అన్నారెడ్డి వెంకట లక్ష్మిరెడ్డి, పెద్దముడియం డీసీ మాధవరెడ్డి, రాజుపాలెం డీసీ భూటూరు వెంకటజయరామిరెడ్డి, పోట్లదుర్తి డీసీ ఎద్దుల వెంకట సుధాకర్ రెడ్డి హాజరయ్యారు. చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఒక్కొక్క నామినేషన్ రావడంతో కడప జిల్లా కసనూరు డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డిని(ఓసీ) చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా అనంతపురం జిల్లా హెచ్ఎల్ఎంసీ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ కొండాపురం కేశవరెడ్డి (బీసీ)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీలో చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు మిగిలిన 10 డిస్ట్రిబ్యూటరీల చైర్మెన్లు సభ్యులుగా కొనసాగుతారు. ఎన్నికైన కమిటీని పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడు వెంకట శివుడుయాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, శింగనమల ద్విసభ్యకమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి తదితరులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్‌ను నూతన కమిటీ సభ్యులు పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించారు.

24న మెగా జాబ్‌మేళా

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత కోరారు. తన కార్యాలయంలో వీసీ శనివారం జాబ్ మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్హతకు తగిన ఉద్యోగ, ఉపాధిని కల్పించేలా జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థలను సమన్వయం చేస్తోందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్చేంజ్, సీడాప్, డీఆర్‌డీఏ, ఎస్కేయూ సంయుక్తంగా 24న మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెవు టెక్, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్, ఐ-సన్ టెక్నాలజీస్, టీసీఎస్ తదితర సంస్థల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్హతతో 18నుంచి 30 సంవత్సరాల లోపు వయసుగల యువతీ, యువకులు అర్హులని తెలిపారు. వివరాలకు యూఎస్‌డీఓ కరీముల్లా 8341366022 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

- అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అంబికా ఫౌండేషన్, అమర రాజా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురం నగర శివారు కక్కలపల్లి క్రాస్ సమీపంలోని ఎంపీ ఆఫీస్‌లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా జాబ్ మేళా ఉంటుందన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ అన్ని ట్రేడ్స్ పాస్ లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకావచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులు చిత్తూరు, తిరుపతిలోని అమరరాజా బ్యాటరీస్ సంస్థలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన ఉద్యోగులకు ట్రైనింగ్ సమయంలో రూ.12,500 నుంచి రూ.13,600 వరకు ఇవ్వడంతోపాటు ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తారన్నారు. శిక్షణ అనంతరం నెలకు రూ.22వేలు వేతనం ఇస్తారన్నారు. మరిన్ని వివరాలకు 9000024919, 9000433990 సెల్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

గుత్తి పీఎస్‌లో నలుగురు బదిలీ

గుత్తి,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న నలుగురు సిబ్బందిని బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ జగదీష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏఎస్ఐ రామచంద్రరెడ్డిని అనంతపురం పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు, హెడ్‌కానిస్టేబుళ్లు జాఫర్, బాలాజీలను అనంతపురం వన్‌టౌన్‌కు, షాజహాన్‌కు అనంతపురం టూటౌన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు

వీఆర్‌కు కానిస్టేబుల్

ఉరవకొండ: ఉరవకొండ అర్బన్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ కులశేఖర్‌రెడ్డిని వీఆర్‌కు పంపినట్లు సమాచారం. సంతకాలను ఫోర్జరీ చేసి రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించారన్న ఆరోపణల నేపథ్యంలో అతనిపై వేటు పడింది. జిల్లా ఎస్పీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలిచ్చినట్లు తెలుస్తోంది.

ఆశాలపై వేధింపులు ఆపాలి: సీఐటీయూ

అనంతపురం టౌన్, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆశాలపై ఎంఎల్‌హెచ్‌పీల వేధింపులు ఆపాలని సీఐటీయూ నాయకురాలు, ఆశా కార్యకర్తల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణి డిమాండ్ చేశారు. డీఎంహెచ్‌ఓను సీఐటీయూ నాయకులు శనివారం కలిశారు. ఈసందర్భంగా నాగమణి మాట్లాడుతూ ఆశావర్కర్లతో సంబంధంలేని పనులు చేయిస్తూ, వేధింపులకు దిగడం అన్యాయమన్నారు. సచివాలయాల వద్దకు రావాల్సిందేనని ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు ఆశాలను వేధిస్తున్నారని తెలిపారు. తాడిపత్రి, ఉరవకొండ, గుత్తి, రాయదుర్గం, తదితరప్రాంతాలలో మూడు వేల నుంచి ఆరు వేలమందికి ఒక ఆశాను కేటాయించారని అలాంటపుడు ఎలా పనిచేస్తారని ప్రశ్నించారు. ఈఒత్తిడి, మానసికవేదన తట్టుకోలేకనే ఉరవకొండలో ఆశా ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ఆశాలపై వేధింపులు, ఒత్తిళ్లు ఆపకపోతే పెద్దఎత్తున సీఐటీయూ తరపున ఆందోళనలు చేస్తామని హెచ్చరిస్తూ డీఎంహెచ్‌ఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగేంద్ర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెకు నాలుగు పిల్లలు



కుందుర్పికి చెందిన సజ్జల కేశన్న మందలో ఒక గొర్రె ఒకే ఈతలో నాలుగు పిల్లలకు జన్మనిచ్చింది. సాధారణంగా గొర్రెలు ఒక కాన్పులో ఒక పిల్లకే జన్మనిస్తాయి. అరుదుగా రెండు పిల్లలకు జన్మనిస్తాయి. కానీ జన్యుపరమైన మార్పులు జరిగినప్పుడు మాత్రం అంతకు మించి పిల్లలు పుడతాయని పశు వైద్యాధికారి ప్రసాద్ తెలిపారు. విషయం తెలియగానే ఆయన వెళ్లి గొర్రెను, పిల్లలను పరీక్షించారు. అన్నీ ఆరోగ్యంగా ఉన్నాయని తెలిపారు. ఈ వింతను చూసేందుకు స్థానికులు ఆసక్తికనబరిచారు.

- ఆంధ్రజ్యోతి, కుందుర్పి

నేడు 15వ వార్షిక సున్నీ ఇజ్‌తెమా

అనంతపురం కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెహరీక్ ఫైజానే ఉమర్ ఫారుక్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం 15వ వార్షిక సున్నీ ఇజ్‌తెమా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి సభా ప్రాంగణాన్ని ఇప్పటికే సిద్ధం చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సయ్యద్ అమీర్ మసూది సాహెబ్, జబల్‌పూర్‌కు చెందిన అబ్దుల ఖాదీర్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించనున్నారు. మహ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం, సాహాబాల పవిత్ర కేశాలు, వారి వస్త్రాలను భక్తుల సందర్శనార్థం ప్రదర్శించనున్నట్లు తెహరీక్ అధ్యక్షుడు హజరత్ హసన్ రజా ఖాద్రి వెల్లడించారు. సున్నీ ఇజ్‌తెమాకు జిల్లాలోని వివిధ ముస్లిం సంఘాలు మద్దతు తెలుపుతూ శనివారం వేదికను సందర్శించాయి. ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా, ఆవాజ్ వలి, ఇంతియాజ్, ఎంఎండీఏ ఇమామ్ తదితరులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ముతవల్లి ఫరీదుద్దీన్, హబీబ్, డాక్టర్ షఫి, అబ్దుల్ సమి, చాంద్‌బాషా పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐలకు అండ

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, గంటా శ్రీనివాసరావు

కళ్యాణదుర్గం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్ఐలకు కూటమి ప్రభుత్వం అన్ని వేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. ఖతార్‌లో ఎన్ఆర్ఐలు శుక్రవారం రాత్రి ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాలకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే అమిలినేని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ దుర్మార్గ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రవాసాంధ్రులు పోలింగ్ రోజున వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవడం చారిత్రాత్మక విషయమన్నారు. మీరంతా అభిమానంతో మద్దతు ఇవ్వడం వల్లే చరిత్రలో కనివినీ ఎరుగని రీతిలో కూటమికి 164 సీట్లు వచ్చాయన్నారు. జగన్ హయాంలో అస్తవ్యస్తంగా మారిన రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పట్టాలెక్కించి, దేశంలో నెంబర్‌వన్‌గా నిలబెట్టడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. ఖతార్‌లోని ప్రవాసాంధ్రులకు అవసరమైన అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీనిచ్చారు. అనంతరం అమిలినేని సురేంద్రబాబును, గంటా శ్రీనివాసరావుని ఖతార్‌లో టీడీపీ, జనసేన శ్రేణులు పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు.

లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి



జిల్లా కమిటీతో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ

అనంతపురం టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి హెచ్చరించారు. జిల్లా కార్యాలయంలో శనివారం ఆమె జిల్లా కమిటీతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ లింగనిర్ధారణ నిషేధిత చట్టాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. డబ్బులకు ఆశపడి లింగ నిర్ధారణ చేసే డాక్టర్లు, స్కానింగ్‌సెంటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఆధారాలతో దొరికితే చట్టప్రకారం వారిపై కేసులు నమోదు చేసి ఆస్పత్రులు, స్కానింగ్‌సెంటర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. లింగ నిర్ధారణ చేసిన డాక్టర్ల సర్టిఫికెట్లను రద్దు చేస్తామన్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు ఎక్కువగా జరుగుతున్నాయని, అందుకే ఆ ప్రాంతాలలో ఆడపిల్లల సంఖ్య తక్కువగా ఉన్నట్లు సమాచారం ఉందన్నారు. అందుకే సరిహద్దుప్రాంతాల అధికారులతో త్వరలో సమన్వయ సమావేశం నిర్వహించి, ఉమ్మడిగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలోను ప్రచార పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టరు సుజాత, డాక్టరు యుగంధర్, డాక్టరు రవికుమార్, డాక్టరు అనుపమజేమ్స్, డాక్టరు ప్రసన్నభారతి, డాక్టరు లక్ష్మీ, ఐసీడీఎస్ సీడీపీఓ వెంకటకుమారి, డీపీఆర్‌ఓ గురుమూర్తి, డెమోలు త్యాగరాజు, గంగాదర్, ఆర్డీటీ డాక్టరు దుర్గేష్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అనిత, వేణు, వెంకటేష్, శ్రీకాంత్, ఉషారాణి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే ప్రయోజనం

ఆర్టీసీ కార్మిక పరిషత్ రీజనల్ అధ్యక్ష కార్యదర్శులు

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే ఆర్టీసీ ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుతోందని ఆర్టీసీ కార్మిక పరిషత్ రీజనల్ అధ్యక్ష కార్యదర్శులు వాసుదేవరెడ్డి, దేవాంజనేయులు పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల నైట్ అవుట్ అలవెన్సులను నిలుపుదల చేయగా.. వాటిని పునరుద్ధరించి, జనవరి నెల జీతంలో కలిపి చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు కార్మిక పరిషత్ ఆధ్వర్యంలో శనివారం అనంతపురం డిపో వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కార్మిక పరిషత్ రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఉన్న ప్రయోజనాలను సైతం అందకుండా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. చంద్రబాబునాయుడు అలవెన్సులను పునరుద్ధరించడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో నాయకులు సోమర రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, గోపాల్, జయప్రకాష్, మదార్, మల్లికార్జున, జి.గోపాల్, నారాయణస్వామి పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు







మృతి చెందిన రత్నకుమారి, కుమారుడు అథర్వ, రత్నమ్మ, డ్రైవర్ మనోజ్(ఫైల్)



ప్రమాదంలో దెబ్బతిన్న టెంపో ట్రావెలర్

రోడ్డు పక్కన మృత్యువు

ఆగిన సిమెంటు లారీని ఢీకొన్న టెంపో ట్రావెలర్

తల్లీకొడుకు, కుటుంబ సభ్యురాలు, డ్రైవర్ మృత్యువాత

మరో 11 మందికి గాయాలు.. నలుగురి పరిస్థితి విషమం

బాధితులు గుడిబండ మండలం కుంబరనాగేపల్లి గ్రామస్థులు

తిరుమల శ్రీవారిని దర్శించుకుని వస్తుండగా ఘోర ప్రమాదం

మడకశిర/టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరిగి వస్తున్న సమయంలో ఘోర ప్రమాదం జరిగింది. రోడ్డు పక్కన ఆగి ఉన్న సిమెంటు లారీని టెంపో ట్రావెలర్ ఢీకొనడంతో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతులను గుడిబండ మండలం కుంబర నాగేపల్లి గ్రామానికి చెందిన ప్రేమకుమారి(30), ఆమె కుమారుడు అథర్వ(2), కుటుంబ సభ్యురాలు రత్నమ్మ(65), డ్రైవర్ మనోజ్(32)గా గుర్తించారు. మడకశిర మండలం బుళ్లసముద్రం సమీపంలో శనివారం తెల్లవారు జామున సుమారు 4.45 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది.

కొడుకు కోసం..

కుంబర నాగేపల్లి గ్రామానికి చెందిన శివరాజ్, ప్రేమకుమారి దంపతులు ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. అధ్వర్య పుట్టిన తరువాత రెండేళ్ల నుంచి కొడుకు సంరక్షణ కోసం ప్రేమకుమారి ఇంటికి పరిమితమయ్యారు. అథర్వ పుట్టు వెంట్రుకలను తీయించేందుకు తిరుమల శ్రీవారి సన్నిధికి రెండు వాహనాల్లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో గురువారం వెళ్లారు. కార్యక్రమాన్ని ముగించుకుని, శనివారం రాత్రి 10 గంటల సమయంలో తిరుగుప్రయాణమయ్యారు. మరో అర గంటలో గమ్యానికి చేరుకునేవారు. డ్రైవర్ మనోజ్ నిద్రమత్తు కారణంగా బుళ్లసముద్రం సమీపంలో జాతీయ రహదారి పక్కన నిలబడి ఉన్న సిమెంటు బస్తాల లారీని గమనించకుండా వేగంగా ఢీకొట్టాడు. దీంతో అథర్వ, ప్రేమకుమారి అక్కడికక్కడే మృతి చెందారు. శివరాజ్ పెద్దమ్మ రత్నమ్మ, డ్రైవర్ మనోజ్ మడకశిర ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించేలోగా మృతిచెందారు. వాహనంలో ఉన్న నాగమణి, గీతమ్మ, శ్రీదేవి, సుజాతమ్మ, శ్వేత, గిరిజమ్మ, ఉమేష్, రవీంద్ర, అమ్మాజమ్మ, కమలమ్మ, గంగమ్మ తీవ్రంగా గాయపడ్డారు. సుజాతమ్మ మెడలోకి ఇనుప రాడ్ దూసుకువెళ్లింది. దీంతో ఆమె పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను మడకశిర ఆస్పత్రి నుంచి తుమకూరులోని (కర్ణాటక) ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితులలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకొన్న శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న, సీఐలు రామయ్య, రాజ్‌కుమార్ ప్రమాద స్థలాన్ని సందర్శించారు.



ఆస్పత్రిలో విషాద ఛాయలు

మడకశిర ఆస్పత్రి ఆవరణలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులతో ఆస్పత్రి నిండిపోయింది. అయినవారి మృతదేహాలను చూసి కన్నీటిని ఆపుకోలేకపోయారు.

అమ్మ ఒడిలోనే..

తిరుగు ప్రయాణంలో అథర్వ తల్లి ఒడిలోనే నిద్రించాడు. ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలను మార్చురీకి తెచ్చేవరకూ తల్లీకొడుకులు కలిసే ఉన్నారు. కుమారుడిని ప్రేమకుమారి తన చేతుల్లో భద్రంగా పట్టుకున్నట్లు కనిపించడం పలువురిని కంటతడి పెట్టించింది. భార్య, కుమారుడు, పెద్దమ్మను కోల్పోయిన శివరాజ్‌ను ఓదార్చడం ఎవరివల్లా కాలేదు.

నాయకుల పరామర్శ

ప్రమాదం గురించి తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న ఆస్పత్రి వద్ద బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ సహా పలువురు పార్టీ నాయకులు ఆస్పత్రి వద్దకు వెళ్లి బాధితులను ఓదార్చారు.

ఘోర ప్రమాదం ఇది : ఎస్పీ రత్న

శ్రీసత్యసాయి జిల్లాలో గడిచిన ఆరు నెలల్లో జరిగిన ఘోర ప్రమాదం ఇదేనని ఎస్పీ రత్న అన్నారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన అనంతరం మడకశిర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఆమె పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకొన్నారు. ఆస్పత్రి వద్ద ఉన్న ప్రేమకుమారి భర్త శివరాజ్‌ను ఓదార్చారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకొన్నారు. తాను మరో వాహనంలో వస్తున్నానని, ముందు వస్తున్న టెంపోట్రావెల్ ప్రమాదానికి గురైందని ఆయన అన్నారు. జరిగిన ఘటన దురదృష్టకరమని, నష్టం పూడ్చలేనిదని ఎస్పీ విచారం వ్యక్తం చేశారు. అనంతరం మార్చురీలో ఉన్న మృతదేహాలను పరిశీలించారు. డీఎస్పీ వెంకటేశులు, సీఐలు రాజ్‌కుమార్, రాగిరామయ్యకు పలు సూచనలు చేశారు. వెంటనే పోస్టుమార్టం పూర్తిచేయించి, కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించాలని సూచించారు. డ్రైవర్ మనోజ్ నిద్రమత్తు కారణంగానే ప్రమాదం జరిగిందని అంచనా వేశామని తెలిపారు. గోరంట్ల వద్ద ఆపి టీ తాగారని, కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవాలని డ్రైవర్‌కు వాహనంలో ఉన్నవారు సూచించినా, త్వరగా వెళ్లాలనే ఆతృతతో ప్రయాణం కొనసాగించాడని ఎస్పీ వివరించారు.



వైద్యులతో వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ రత్న

మంత్రి దిగ్ర్భాంతి

పెనుకొండ టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మడకశిర మండలంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం గురించి తెలియగానే మంత్రి సవిత దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో నలుగురు మృతిచెందడం బాధాకరమని అన్నారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై మంత్రి ఆరాతీశారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అండగా ఉంటుందని అన్నారు.



అధికారులతో క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఆరాతీస్తున్న మంత్రి సవిత

విద్యారంగాన్ని ఆదర్శంగా నిలపడమే లక్ష్యం

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



ఎంజేబీ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

బుక్కపట్నం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శంగా నిలపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఎంజేబీ పాఠశాల, హాస్టల్‌ను తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, పరిసర ప్రాంతాలు, మరుగుదొడ్లను నిశితంగా పరిశీలించారు. దోమలు విపరీతంగా ఉండడంతో సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ ఫాగింగ్‌చేసి, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులను కలిసి ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును, హాస్టల్లో భోజన సదుపాయంపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీసీ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేశారు. ప్రతిరోజు హాస్టల్ పరిసరాల్లో పోలీస్ గస్తీ నిర్వహించాలని ఎస్ఐ క్రిష్ణమూర్తిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, హాస్టల్ వార్డెన్ రమాదేవి, టీడీపీ నాయకులు శ్రీనివాసులు, సామకోటి ఆదినారాయణ, జంగం వెంకటరాముడు, నారాయణస్వామి, మంజు, సుదీర్, తదితరులు పాల్గొన్నారు.

భక్తరహళ్లి హుండీల ఆదాయం రూ.21 లక్షలు



ఆలయంలో హుండీ లెక్కిస్తున్న అధికారులు

మడకశిర రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని భక్తరహళ్లి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి హుండీలను శనివారం లెక్కించారు. ఈ రెండు దేవాలయాల నుంచి రూ.21.01 లక్షలు వచ్చినట్లు దేవదాయశాఖ ఈఓ నరసింహరాజు తెలిపారు. ఆంజనేయస్వామి హుండీ నుంచి రూ.8.11 లక్షలు, నరసంహస్వామి హుండీ నుంచి రూ.12.90 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈఓ వివరించారు.

ఘనంగా గుత్తి రైల్వే డీజిల్ లోకో షెడ్ వార్షికోత్సవం



కేకును కట్‌చేస్తున్న డీఆర్ఎం, అధికారులు

గుత్తి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుత్తిఆర్ఎస్‌లోని రైల్వే డీజిల్ లోకో షెడ్ 61వ వార్షికోత్సవాలను స్థానిక డీజిల్ షెడ్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజరు విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై, కేకును కట్ చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గుత్తి రైల్వే డీజిల్ షెడ్ కార్మికులు, అధికారులు, ఉద్యోగుల సమష్టి కృషితోనే పురోభివృద్ధి సాధిస్తోందన్నారు. అనంతరం డీజిల్ షెడ్‌లో కంట్రోల్‌రూంను ఆయన ప్రారంభించారు. వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడాపోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, సీఎంఎస్ వేణుగోపాల్‌రెడ్డి, డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ ప్రమోద్, డీఎస్ఏ మంగాచారి, ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు మాధవి విజయ్‌కుమార్, స్థానిక ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు ప్రియాంక, అధికారులు, వివిధ కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

పరీక్షా పే చర్చ ద్వారా సమస్యల పరిష్కారం

బుక్కపట్నం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పరీక్షా పే చర్చ ద్వారా విద్యా సమస్యల పరిష్కారానికి అవకాశం ఉంటుందని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షా పే చర్చ-2025 కార్యక్రమానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన తెలిపిన వివరాల మేరకు 2025 జనవరి 14 లోపు గుర్తింపు పొందిన పాఠశాలల్లో 6నుంచి 12తరగతివరకు చదివిన విద్యార్థుల తల్లిదండ్రులు అర్హులన్నారు. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు పై గవర్నమెంట్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో విద్యార్థుల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారు ప్రధానమంత్రితో చర్చలో పాల్గొనే అవకాశముంటుందన్నారు.

రూరల్ క్రికెట్ లీగ్ పోటీల్లో బౌలర్ల హవా



కుశాల్



మహేంద్రసాయి

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రూరల్ క్రికెట్ లీగ్ పోటీల్లో బౌలర్ల హవా సాగింది. జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం బాలుర అండర్-15, బాలికల అండర్-16 రూరల్ క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించారు. బాలికల పోటీల్లో ధర్మవరం, అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ జట్లు తలపడ్డాయి. ధర్మవరం 19.3ఓవర్లలో79పరుగులకు ఆలౌట్ అయ్యింది. బౌలర్లు మాన్విత 3, హస్విరెడ్డి 2వికెట్లు పడగొట్టారు. అనంతరం బరిలోకి దిగిన ఏఎస్ఏ 7.4ఓవర్లలో వికెట్ నష్టపోకుండానే లక్ష్యాన్ని ఛేదించింది. మరో మ్యాచ్‌లో గుంతకల్లు, నార్పల జట్లు తలపడ్డాయి. గుంతకల్లు 25ఓవర్లలో 2వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. బ్యాటర్ నందిని 112 చేశారు. అనంతరం బరిలోకి దిగిన నార్పల 7.2ఓవర్లలో 17పరుగులకే ఆలౌట్ అయ్యింది. బౌలర్లు జాహ్నవి 4, నందిని 4వికెట్లు పడగొట్టారు.

బాలుర పోటీల్లో నార్పల, ధర్మవరం జట్లు తలపడ్డాయి. ధర్మవరం జట్టు 25ఓవర్లలో 85పరుగులకే ఆలౌట్ అయ్యింది. అనంతరం స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన నార్పల 20.1ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. తపోవనం క్రికెట్ అకాడమీ, రాప్తాడు జట్లు తలపడగా... టీసీఏ 40ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 208పరుగులు చేసింది. కార్తీక్ 60, సాత్విక్ 51పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన రాప్తాడు 40ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 108పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి పర్యవేక్షించి సెంచరీలు నమోదు చేసిన క్రీడాకారులను అభినందించారు.

విద్యార్థి అదృశ్యం



విద్యార్థి జగదీష్ నాయక్

కదిరి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక వీవర్స్ కాలనీలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి జగదీష్‌నాయక్ అదృశ్యమైనట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి శనివారం తెలిపారు. ఈ మేరకు వార్డెన్ జయరామిరెడ్డి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి జగదీష్‌నాయక్, మరో అబ్బాయి ఫోన్ తీసుకుని హైదరాబాద్‌లో ఉన్న తన అమ్మమ్మతో మాట్లాడాడు. తనకు చదువుకోవడం ఇష్టం లేదని, అమ్మమ్మ వద్దకు వెళ్లతానని స్నేహితులతో చెప్పాడు. శనివారం ఉదయం హాస్టల్ సిబ్బంది గదిలో చూడగా జగదీష్‌నాయక్ కనిపించలేదు.

వార్డెన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. జగదీష్‌నాయక్ ఆచూకీ తెలిసినవారు సీఐ నారాయణరెడ్డి ఫోన్ నెంబరు 9440796852, వార్డెన్ జయరామిరెడ్డి సెల్ 7780732031కు సమాచారం ఇవ్వాలని కోరారు.

బాలిక అదృశ్యం

అనంతపురం క్రైం,డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కలెక్టరేట్ సమీపంలోని చిల్డ్రన్స్ హోం నుంచి శుక్రవారం ఓ బాలిక అదృశ్యమైంది. కల్పనాజోష్ కాలనీకి చెందిన దూదేకుల షబీనా గత కొన్నేళ్లుగా చిల్డ్రన్స్ హోమ్‌లో ఉంటోంది. బాలిక అదృశ్యంపై చిల్డ్రన్స్ హోమ్ సూపరింటెండెంట్ నేతాజీ శనివారం ఫిర్యాదు చేశారు. ఆమేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీసత్యసాయి డీఎంహెచ్ఓగా ఫిరోజ్‌బేగం

అనంత ఆసుపత్రి ఆర్ఎంఓగా రామకృష్ణ

నెల్లూరు డీఎంహెచ్ఓగా అనంత డాక్టర్ సుజాత

అనంతపురం టౌన్/పుట్టపర్తి రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీనియర్ వైద్యుల ఆశలు నెరవేరాయి. రెండేళ్లుగా ఉద్యోగోన్నతుల కోసం ఎదురు చూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగోన్నతులు కల్పిస్తామని ఊరడించి చేతులెత్తేసింది. దీంతో సీనియర్ డాక్టర్లు నిరాశతో ఉండిపోయారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సీనియర్ డాక్టర్ల ఉద్యోగోన్నతులకు అవకాశం కల్పించారు. అర్హత ఉన్నవారికి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగోన్నతులు కల్పించి పోస్టింగులు ఇచ్చింది. సత్యసాయి జిల్లా డీఎంహెచ్ఓగా డాక్టర్ ఫిరోజ్‌బేగంను ఉద్యోగోన్నతిపై నియమించింది. ఈమె అన్నమయ్య జిల్లా వాయల్పాడు సీహెచ్‌సీలో పనిచేస్తున్నారు. అనంతపురం జిల్లా సర్వజన ఆసుపత్రి ఆర్ఎంఓగా డాక్టర్ సీహెచ్ రామక్రిష్ణ నియమితులయ్యారు. ఈయన కర్నూలు జిల్లా వైద్యవిధాన పరిషత్‌లో సివిల్ డిస్పెన్సరీ విభాగంలో పనిచేస్తున్నారు.



డాక్టర్ ఫిరోజ్ బేగం

● అనంతపురం జిల్లాకు చెందిన సీనియర్ డాక్టర్ సుజాతకు ఉద్యోగోన్నతి దక్కింది. జిల్లా వైద్యశాఖలో ప్రస్తుతం ప్రోగ్రామ్ ఆఫీసరుగా పనిచేస్తున్న డాక్టర్ సుజాతను ఉద్యోగోన్నతిపై నెల్లూరు డీఎంహెచ్ఓగా నియమించారు. ఈమె 1997 డాక్టర్‌గా జిల్లాలో చేరారు. ముదిగుబ్బ, కొర్రకోడు, తనకల్లు, ఆత్మకూరు పీహెచ్‌సీలలో విధులు నిర్వర్తించారు. కొన్నేళ్లుగా జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో వివిధ విభాగాలకు ప్రోగ్రామ్ ఆఫీసరుగా పనిస్తున్నారు. నెల్లూరు డీఎంహెచ్‌ఓగా వెళుతుండటంతో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, డీఐఓ డాక్టర్ యుగంధర్, డీఎంఓ ఓబులు, డాక్టర్లు, వైద్యసిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.



డాక్టర్ సుజాత

బైకులోని డబ్బు చోరీ



రైతు బొరుగుల అశోక్

కళ్యాణదుర్గం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరంపల్లి గ్రామానికి చెందిన రైతు బొరుగుల అశోక్‌కు చెందిన రూ.75 వేలు శనివారం చోరీ అయ్యింది. కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి గ్రామానికి చెందిన అశోక్ గ్రామంలో మూడు ఎకరాల్లో అరటి సాగు చేశాడు. పంటను కంపెనీ వారికి విక్రయించాడు. అందుకు సంబంధించిన నగదును వారు బ్యాంకు అకౌంట్‌లో వేశారు. దీంతో ఆయన డబ్బులు డ్రా చేసుకుని కూరగాయలు తీసుకునేందుకు బళ్లారి మిట్ట మీదకు వెళ్లాడు. అయితే డబ్బులు ద్విచక్ర వాహనంలోనే ఉంచాడు. కూరగాయలు తీసుకునే సమయంలో నీలి రంగు టీ షర్టు వేసుకుని వచ్చిన ఓ వ్యక్తి ద్విచక్రవాహనంలోని డబ్బు ఎత్తుకుని వెళ్లాడని రైతు వాపోయాడు. ఈ ఘటన జరిగిన ప్రాంతానికి డీఎస్పీ కార్యాలయం కూతవేటు దూరంలో ఉండటం గమనార్హం. చోరీ విషయమై బాధిత రైతు పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

ప్రశాంతి నిలయంలో క్రిస్మస్ వేడుకలు

పుట్టపర్తి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంతులో శనివారం క్రిస్మస్ వేడుకలు కన్నుల పండువగా సాగాయి. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ క్రిస్మస్ క్యాండిల్స్‌ను వెలిగించి వేడుకలను ప్రారంభించారు. మహాసమాధి వద్ద ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం విదేశీ భక్తులు భక్తి పాటలు పాడారు. సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. గణేశ్ గేటు వద్ద క్రిస్మస్ ట్రీని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.



మహాసమాధి వద్ద అలంకరణ



క్యాండిల్స్‌ను వెలిగిస్తున్న ఆర్‌జే రత్నాకర్

పర్కులేషన్ ట్యాంకు కోసం సర్వే

సీఎం హామీ నెరవేర్చే దిశగా అడుగులు

డి.హీరేహాళ్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలో పర్కులేషన్ ట్యాంక్ నిర్మించబోయే ప్రదేశంలో సర్వే పనులు చేపట్టారు. ఆ ప్రాంతంలో ముళ్ల కంపలు మొత్తం తొలగించారు. నాలుగైదు రోజుల్లో సర్వే పనులు మొత్తం పూర్తి చేసి అక్కడ నిర్మించబోయే పర్కులేషన్ ట్యాంకుకు సంబంధించి డీపీఆర్‌ను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని స్థానిక అధికారులు తెలిపారు. గత నెల 30న సీఎం చంద్రబాబు బొమ్మనహాళ్ మండలంలోని నేమకల్లులో పర్యటించిన సందర్భంగా పర్కులేషన్ ట్యాంకు కావాలని నియోజకవర్గ రైతులు ఆయనకు విన్నవించారు. దీంతో ఆయన పని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈక్రమంలోనే గురువారం నుంచి సర్వే పనులు ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగళ్లి రాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇక్కడ ఒక పెద్ద పర్కులేషన్ ట్యాంక్ నిర్మించి చుట్టుపక్కల గ్రామాల రైతులు, ప్రజలకు నీటి కష్టాలు తీరుస్తామని హామీ ఇచ్చామన్నారు. దానికి కట్టుబడి ప్రభుత్వం నుంచి పర్కులేషన్ ట్యాంకు నిర్మాణానికి అనుమతి పొందామన్నారు. పనులను వెంటనే ప్రారంభించి ఏడాది కాలంలోపే ట్యాంక్ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.

సంక్షిప్తం

సభ్యత్వ నమోదుకు విరాళం



రూ.50వేల విరాళం అందజేస్తున్న సరళ

అనంతపురం అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అర్బన్‌లో పేదలతో టీడీపీ సభ్యత్వ నమోదు కోసం మాజీ కార్పొరేటర్ సరళ రూ.50వేలు విరాళం అందించారు. టీడీపీ అర్బన్ కార్యాలయంలో శనివారం పార్టీ రాష్ట్ర నాయకుడు గంగారామ్ ఆమె విరాళం అందజేశారు. నాయకులు సల్మాన్, బన్నీ, భరత్, తేజ తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.16

అనంతపురం రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 16తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 10, కనిష్ఠ ధర రూ. 5 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురం స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 30,290 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 10 వేలు, సరాసరి రూ. 24 వేలుతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 16 టన్నుల చీనీకాయలు వచ్చాయని ఆయన తెలిపారు.

సోలార్‌పై అవగాహన కల్పిస్తాం

● విద్యుత్ శాఖ డీఈ

శింగనమల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రజలకు రూఫ్ టాప్ సోలార్ సిస్టంపై అవగాహన కల్పిస్తామని విద్యుత్ శాఖ డీఈ జొన్నలగడ్డ రమేష్ బాబు పేర్కొన్నారు. ఆయన శనివారం శింగనమల ట్రాన్స్‌కో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలు రూఫ్ టాప్ సోలార్ సిస్టంను సద్వినియోగం చేసుకుని విధంగా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఏఈ విజయ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

వనమిత్ర పరిశీలన

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో స్థానిక పండమేరు వంక వద్ద ఉన్న వనమిత్ర పార్కును శనివారం డీఎఫ్ఓ విఘ్నేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అయితే పర్యాటకులకు అనుగుణంగా వాతావరణం కల్పించలేదని సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం డీఎఫ్ఓ వెళ్లిన తరువాత అక్కడి మరుగుదొడ్లను పరిశీలించిన రేంజర్ సిబ్బందిపై మండిపడ్డారు. డీఎఫ్ఓ సూచనల మేరకు చేపట్టాల్సిన అంశాలను సెక్షన్ ఆఫీసర్ అక్బర్, బీట్ ఆఫీసర్ మారెప్ప, ఏబీఓ గిరీష్‌కు వివరించారు.


శాశ్వత పనులు చేపట్టాలి

నార్పల, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందలవాడ గ్రామంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై శనివారం సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచు ఆలం వెంకటనరసా నాయుడు మాట్లాడుతూ... రైతులకు ఉపయోగపడే విధంగా శాశ్వత నిర్మాణ పనులను ఉపాధి హామీ పథకం కింద చేపట్టాలని పేర్కొన్నారు. అందుకే టీడీపీ అధికారంలోకి వచ్చాక శాశ్వత నిర్మాణాలైన గోకులం షెడ్లు, కమ్యూనిటీ రెయిన్ వాటర్ హార్వె స్టింగ్ తదితరు పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఏపీఓలు ఓబన్న, ఎర్రమ్మ, గ్రామ కార్యదర్శి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్

అనంతపురం క్రైం,డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హెచ్చెల్సీ కాలనీలో శనివారం ఉదయం చైన్‌స్నాచింగ్ జరిగింది. టీటీడీ కల్యాణమండపం సమీపంలో నివాసముంటున్న చిగిచెర్ల లక్ష్మీదేవి శనివారం ఇంటి నుంచి లోపలికి వెళ్తుండగా...గుర్తుతెలియని వ్యక్తి వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. అప్పటికే బైక్‌పై సిద్ధంగా ఉన్న మరో వ్యక్తితో కలిసి ఉడాయించాడు. నిర్ఘాంతపోయిన లక్ష్మీదేవి తన రెండున్నర తులాల బంగారు గొలుసు లాక్కెళ్లినట్లు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సీసీ పుటేజీ పరిశీలింగగా దొంగలు వచ్చిన పల్సర్ బైక్‌కు నెంబరు లేదు. వారు మాస్కులు వేసుకుని ఉండటంతో విచారణ చేస్తున్నారు.

సభ్యత్వ నమోదులో బోయపాటి సుధాకర్ చౌదరి టాప్



కనగానపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో మండలంలోని వేపకుంట గ్రామానికి చెందిన బోయపాటి సుధాకర్ చౌదరి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు. పార్టీ సీనియర్ నాయకుడైన ఆయన ప్రస్తుతం రాప్తాడు నియోజకవర్గ కో- ఆర్డినేటర్‌గా పని చేస్తున్నారు. దాదాపు ఐదు వేలకు పైగా సభ్యత్వ నమోదు చేయించడంతో టాప్ రెఫరల్ ర్యాంకర్‌గా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చినట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ యాతం పోత లయ్య శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

ఆ గుంతలతో సంబంధం లేదా..?



కక్కలపల్లి క్రాస్‌లో వేసిన బీటీ ప్యాచ్ పక్కనే గుంత

● ప్యాచ్ వర్క్‌లు చేసిన ప్రాంతంలోనే గుంతలు

● ఇబ్బంది పడుతున్న వాహనదారులు

అనంతపురం రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కక్కలపల్లి ప్రధానరోడ్డు ప్యాచ్ వర్కులు ప్రారంభమయ్యాయి. గత రెండురోజులుగా ముమ్మరంగా సాగుతున్న పనులు తుది దశకు చేరుకున్నాయి. అయితే ప్యాచ్ వర్కులను చూసి పడే ఆనందాన్ని రోడ్డుపై కనిపిస్తున్న గుంతలు ఆవిరి చేస్తున్నాయి. కక్కలపల్లి ప్రధాన రోడ్డు ప్యాచ్ వర్కుల ఆలస్యంతో కంకర తేలి వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఈ నెల 19న 'ఏం రోడ్డప్పా ఇది' అనే శీర్షికన ఆంధ్ర జ్యోతి కథనం ప్రచురించింది. ఇందుకు సంబంధిత అధికారులు స్పందించారు. ఈ క్రమంలోనే రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. అయితే కేవలం ప్యాచ్ వర్కులు చేస్తూ, రోడ్డు పైన, రోడ్డుకు అటు ఇటు ఉన్న గుంతలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఆ గుంతల్లో బీటీ మిశ్రమం వేస్తే సమస్య పరిష్కారం అవుతుంది. అయినా ఇవేవీ పట్టించుకోకుండా ప్యాచ్ వర్కులు మాత్రమే చేసు కుంటూ వెళుతున్నారు. చిన్న చిన్న గుంతలను కూడా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. దీనిపై కొంత మంది వాహనదారులు పెదవిరుస్తున్నారు. ఇంత పనులు చేస్తున్నారు.... రోడ్డు మధ్యన, ఇరుపక్కల ఉన్న పక్కనున్న గుంతలను కూడా కనిపించకుండా చేస్తే ప్రయాణ కష్టాలు తీరుతాయని ప్రజలు , వాహనాదారులు మాట్లాడుకుంటున్నారు.



కాటిగానికాలువకు వెళ్లే దారిలో గుంతలు

కన్నులపండువగా మహా పడిపూజ



అలంకరణలో అయ్యప్పస్వామి మహాపడి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయ హరిహరసుత అయ్యప్పస్వామి దేవాలయంలో శనివారం సాయంత్రం స్వామివారి మహాపడిపూజోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉదయం మూలవిరాట్‌కు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలోని వేదికపై గణపతి, లక్ష్మి, అయ్యప్పస్వామి ఉత్సవమూర్తులను ఉంచి, ప్రత్యేక అలంకరణ చేశారు. గురుస్వాములు రంగాచారి, ప్రసాద్ నంబూద్రి నేతృత్వంలో పడి పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. దీక్షధారుల అయ్యప్ప శరణుఘోషతో ఆ ప్రాంతం మార్మోగింది. అనంతరం దీక్షధారులకు భిక్ష అంద జేశారు. ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు, కోఆప్షన్ మెంబర్ గంగన లక్ష్మి రెడ్డి, గురుస్వాములు శ్రీనివాసులు, ఆంజనేయులు, వెంకటనారాయణ, రామ్ నారాయణ, చలపతి, ఏఎంసీ శ్రీనివాసులు, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న దృశ్యం

ఘనంగా అయ్యప్ప గ్రామోత్సవం



అలంకరణలో అయ్యప్ప ఉత్సవ మూర్తి

బుక్కరాయసముద్రం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం అయ్యప్ప స్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి, ప్రత్యేక వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. అయ్యప్ప మాలధారులు భజన కీర్తనలు పాడుతూ, నృత్యాలు చేస్తూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కేశన్న, అశోక్ కుమార్, శివకుమార్, పోతలయ్య, కంఠశేఖర్, గొట్లూరు నరేష్, సురేష్, రాము, మారతీప్రసాద్, నాగేంద్ర, బండిగిరి, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు టీడీపీ అండ

●ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ● సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : నిరు పేదలకు టీడీపీ అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. వివిధ అనారోగ్య సమస్యలతో వైద్య చికిత్సలు పొందిన పలువురు నిరుపేదలకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి సొమ్మును ఆమె శనివారం అందజేశారు. ఆమె నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో శింగనమల నియోజకవర్గంలోని ఐదుగురికి రూ.4,78,646 చెక్కులను అందజేశారు. రాష్ట్రం ఆర్థికంగా ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు పేదలను ఆదుకుంటూ పెద్ద దిక్కుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.

● కనగానపల్లి : మండలంలోని తల్లిమడుగుల గ్రామానికి చెందిన ఉప్పర సూరి అనారోగ్యానికి గురై పలు ఆసుపత్రుల్లో చికిత్సలు పొందాడు. ఆయనకు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ2,55,225 చెక్కు మంజూరైంది. దానిని శనివారం సర్పంచ్ ఈడిగ రామాంజినేయులు టీడీపీ నాయకులతో కలిసి లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో సాగునీటి చైర్మన్ వెంకటనారాయణ, మనోహరనాయుడు, శీనా, తోగంటి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగుల వినతి

అనంతపురం రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఈసీఈఏ-3045) సభ్యులు శనివారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో కలిశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన పాదయాత్రలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీలకు సంబంధించిన వినతిపత్రం అందజేసినట్లు యూనియన్ రాష్ట్ర కోర్డినేటర్ రవికుమార్ తెలిపారు. యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్, కమిటీ సభ్యులు మురళి పాల్గొన్నారు.

ఎంపీకి వడ్డెర్ల సంఘం నాయకుల కృతజ్ఞతలు



వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని పార్లమెంట్‌లో గళం వినిపించినందుకు వడ్డెర్ల సంఘం నాయకులు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి అనంత జిల్లా వడ్డెర్ల సంఘం అధ్యక్షుడు కుంచెపు వెంకటేష్, నాయకులు మంజు, సుధాకర్, రామ్మోహన్ శనివారం నగర శివారులోని ఆయన నివాసమంలో ఎంపీకి శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

-ఆంధ్రజ్యోతి, అనంతపురం అర్బన్

ఎగువ కాలవకు రూ. 500 కోట్లు ఇవ్వాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్

అనంతపురం విద్య, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాల రైతాంగానికి ఎంతో ఉపయోగపడే హెచ్చెల్సీ ఎగువ కాలవ ఆధునికీకరణకు రూ. 500 కోట్లు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్ డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ కార్యాలయంలో ఆయన జిల్లా కార్యదర్శి జాఫర్, ఇతర నేతలతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీష్ మాటాడుతూ.. ఎగువ కాలవ ఆధునికీకరణ వల్ల 30 టీఎంసీల నీళ్లు రావడంతో... అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల్లో తుంగభద్ర జలాలు పూర్తిగా పంపడానికి సాధ్యపడుతుందన్నారు. చివరి ఆయకట్టుకు సైతం నీళ్లు అందుతాయన్నారు. రూ.36 కోట్లు ఏమాత్రం సరిపోవని, ఆధునికీకరణ చేయడానికి రూ. 500 కోట్లు మంజూరుచేయాలని కోరారు. పేదలకు ఇళ్ల నిర్మాణానికి గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇవ్వడంతోపాటు రూ. 5 లక్షలు మంజూరుచేయాలన్నారు. ప్రస్తుతం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని కోరారు. జనవరి 2వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ... సచివాలయాలు, ఎమ్మార్వో, కలెక్టర్ కార్యాలయాల వద్ద సీపీఐ, వ్యవసాయ, కార్మిక సంఘాలతో కలిసి నిరసన తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ స్వామి, మల్లికార్జున, రాజారెడ్డి, కేశవరెడ్డి, రాజేష్ గౌడ్, శ్రీరాములు పాల్గొన్నారు.

అప్పర్‌పెన్నార్ ప్రాజెక్టు ఎన్నికలు ఏకగ్రీవం



అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు చైర్మన్‌కు డిక్లరేషన్ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత



పేరూరు ఆయకట్టు సాగునీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులతో ఎమ్మెల్యే - రామగిరి

గురుకుల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

రామగిరి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరులో ఉన్న మహాత్మాజ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే పరిటాల సునీత శనివారం సాయంత్రం సందర్శించారు. అక్కడ విద్యార్థులతో ముచ్చటించి ప్రశ్నలకు సమాధానాలు రాబట్టి పెన్నులను బహూకరించారు. పాఠశాలలో మౌలిక వసతులపై ప్రిన్సిపాల్‌తో ఆరాతీశా రు. మాజీ జడ్పీటీసీ రామ్మూర్తినాయుడు, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్, పేరూరు సాగునీటి సంఘం వైస్ చైర్మన్ నర సింహులు, టీడీపీ నాయకులు కంబదూరు రామ్మోహన్ నాయుడు, లక్ష్మీనారాయణ, యాతంపోతలయ్య కొండన్న, మాదాపురంశంకర్, కోటి తిమ్మారెడ్డి, ఈశ్వరయ్య, చిత్తరంజన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీకేపల్లికి ఎమ్మెల్యే రాక

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ ఆదివారం చెన్నేకొత్తపల్లికి రానున్నారని ఏపీ ఎంఐపీ ఎంఐఏఓ రవిశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్సిడీ కింద మంజూరైన డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలను ఎమ్మెల్యే సునీత, పరిటాల శ్రీరామ్, వీడీ సుదర్శన్ చేతులమీదుగా ఉదయం 9గంటలకు పంపిణీ చేస్తామ న్నారు. జాతీయ రహదారి పక్కన అంబేడ్కర్ విగ్రహం సమీపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

● బీఎస్పీ నాయకులు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన అమిత్‌షాను కేంద్ర హోంమంత్రిగా తక్షణమే బర్తరఫ్ చేయాలని బీఎస్పీ నాయకులు డిమాండ్‌చేశారు. ఈ మేరకు శనివారం బీఎస్పీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. జిల్లా ఇన్‌చార్జ్ నాగరాజు, నియోజకవర్గ అధ్యక్షుడు అడ్వకేట్ హరిప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడారు. నాయకులు కుళ్లాయప్ప, గోపాల్, నాగరత్నమ్మ, జిలాన్‌భాష తదితరులు పాల్గొన్నారు.

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

అంబేడ్కర్ పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వాఖ్యలపై ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు శనివారం ఎస్సీఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకేహరి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, వివిధ వర్గాలకు చెందిన ప్రముఖులు హాజరై వారి అభిప్రాయాలను పంచుకోవాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

పంచాయతీల అభివృద్ధికి నిధులు తీసుకురండి



ఎమ్మెల్యే ఎంఎస్ రాజును కలిసిన బాబు రాజేంద్రప్రసాద్

శింగనమల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పంచాయతీల అభివృద్ధికి నిధులు తెచ్చేందుకు ఎమ్మెల్యేలు కృషి చేయాలని పంచాయతీ రాజ్ చాంబర్ జాతీయ అధ్యక్షుడు ఎలమంచిలి బాబు రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. అనంతపురానికి శనివారం వచ్చిన ఆయనను చాంబర్ ప్రధాన కార్యదర్శులు డేగల కృష్ణమూర్తి, బిర్రు ప్రతాప్‌రెడ్డి, సభ్యులు భూషణ్ నాయుడు, ఉమ్మడి అనంతపురం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు ఇస్మాయిల్, ధనుంజయ కలిశారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ మంత్రి పల్లె రాఘునాథ్‌రెడ్డి, పుటపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరని ఆయన వారి స్వగృహాలలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

ఘనంగా గణిత దినోత్సవం

అనంతపురం విద్య, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని నగరంలోని పలు స్కూళ్లలో జాతీయ గణిత దినోత్సవాన్ని శనివారం పండుగలా నిర్వహించారు. అశోక్ నగర్‌లోని మినర్వా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులు అనేక గణిత నమూనాలు చేసి వివరించారు. కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, టీచర్లు పాల్గొన్నారు. రుద్రంపేటలోని శ్రీచైతన్య స్కూల్‌లో వివిధ రకాల వేషధారణలతో, ప్రత్యేక మైన యాక్టివిటీలతో విద్యార్థులకు గణిత పదాలను బోధించారు. ఏజీఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఏవో విజయ్‌కృష్ణన్, ప్రైమరీ ఇన్‌చార్జ్‌లు సరిత, స్వాతి, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జ్ అమరావతి, తదితరులు పాల్గొన్నారు. నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న శ్రీచైతన్య స్కూల్‌లో ప్రిన్సిపాల్ తబస్సుం, ఏవో గోపాల్, డీన్లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్ పాల్గొన్నారు. గుత్తిరోడ్డు, సంగమేష్ సర్కిల్‌లో ఉన్న మాంటిస్సోరి విద్యాసంస్థల్లో ఇన్‌ఫినిటీ అండ్ బియాండ్ అనేక గణిత ప్రదర్శన ఏర్పాటుచేశారు. పిల్లలతో పలు గణిత నమూనాలు తయారు చేయించి మ్యాథ్స్ సిద్ధాంతాల గురించి పిల్లలకు వివరించారు. కరస్పాండెంట్ సూర్యనారాయణ, కార్యదర్శి మాధవి, ప్రిన్సిపాల్ పద్మావతి, టీచర్లు పాల్గొన్నారు.



మినర్వా స్కూల్‌లో గణిత దినోత్సవం



శ్రీచైతన్య స్కూల్‌లో...



మాంటిస్సోరి స్కూల్‌లో...

సెలవుల్లో వంద రోజుల ప్రణాళికను బహిష్కరిస్తాం

● ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సెలవు రోజుల్లో వంద రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని బహిష్కరిస్తామని ఏపీటీఎఫ్-257 నాయకులు హెచ్చరించారు. ఆ సంఘం నాయకులు శనివారం ఉపాధ్యాయభవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్ మాట్లాడుతూ... సిలబస్ పూర్తికాకుండానే పదో తరగతి విద్యార్థుల కోసం వంద రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారన్నారు. ముఖ్యంగా సెలవు దినాలు, పండుగ రోజుల్లో సైతం దీన్ని అమలు చేయాలని చూస్తున్నారన్నారు. సెలవు రోజుల్లో నిర్వహిస్తే బహిష్కరిస్తామన్నారు. సంఘం పూర్వపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహులు, జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్‌కుమార్, ఇతర నేతలు వెంకటరమణ, వన్నప్ప, లక్ష్మీనారాయణ, తిప్పేస్వామి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో మినహాయింపు ఇవ్వాలి

సెలవు రోజుల్లో మినహాయింపు వందరోజుల యాక్షన్ ప్లాన్‌కు మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ 1938 నాయకులు విద్యాశాఖాధికారులను కోరారు. శనివారం ఆ సంఘం నాయకులు డీఈఓను కలిసేందుకు వెళ్లగా ఆయన లేకపోవడంతో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇచ్చారు. దీనిపై సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్ నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ..... ఈ నెల 22 నుంచి 29 వరకు మిషనరీ స్కూళ్లకు క్రిస్మస్ సెలవులు ఉన్నాయన్నారు. అలాగే 26న నుంచి జరిగే ఎఫ్ఎల్ఎన్ శిక్షణ, 27,28 తేదీల్లో నిర్వహించే కాంప్లెక్స్ మీటింగ్స్‌ను జనవరికి వాయిదా వేయాలన్నారు. నాయకులు సత్యప్రసాద్, సాయినాథరెడ్డి, నారాయణ నాయక్, హుస్సేన్ ఖాన్ పాల్గొన్నారు.

ఘనంగా బాల్ బ్యాడ్మింటన్ దినోత్సవం

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బాల్ బ్యాడ్మింటన్ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక న్యూటౌన్ బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో పోటీలు నిర్వహించారు. జమ్మలమడక పిచ్చయ్య జయంతి సందర్భంగా బాల్ బ్యాడ్మింటన్ దినోత్సవాన్ని నిర్వహించారు. పిచ్చయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోటీలలో పాల్గొన్న క్రీడావిజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా బాల్ బ్యాడ్మిం టన్ అసోసియేషన్ కార్యనిర్వాహక కా ర్యదర్శి ఈశ్వరయ్య, సభ్యులు రియాజు ద్దీన్, విజయ్‌కుమార్, మహబూబ్‌భాషా, బాబా, క్రీడాకారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు

అనంతపురం రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజలు, రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మోహన్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కక్కలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామస్థులు, రైతుల నుంచి 15 అర్జీలు వచ్చాయి. భూములకు సంబంధించి పూర్తి స్థాయిలో పత్రాలు అంద జేస్తే, వాటిని ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తహసీల్దార్ రైతులకు వివరించారు. దేవదాయ శాఖ మండల అధికారి రామాంజినేయులు, జడ్పీటీసీ చంద్రకుమార్, గ్రామ సర్పంచు కిష్టయ్య, ఎంపీటీసీ ఓబులేసు, టీడీపీనాయకులు శంకర్, నారాయణస్వామి, జూటురు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

● ఆత్మకూరు : మండల పరిధిలోని సనప గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలో పోతప్పగుడికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని గ్రామస్థులు అధికారులు కోరుతున్నారు. ఇటీవల ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో గ్రామంలో 39సెంట్లు కేటాయించి రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ లక్ష్మీనాయక్ పట్టా అందజేయడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు శశాంక చౌదరి, పోతులయ్య, ఏడీ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

రేపు ఉచిత వైద్య శిబిరం

గుంతకల్లుటౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల గొండ గ్రామంలో నారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ ట్రస్టు అధ్యక్షుడు ఆర్.నారాయణనాయక్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం హాజరవుతారన్నారు. వైద్యులు పత్తిహిమబిందు, రఘురాములునాయక్, రమణానాయక్ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. గ్రామ ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

గుంతకల్లుటౌన్, డిసెంబరు 21 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని కొనకొండ్ల రోడ్డులో గల వివేకానంద ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వ్యవస్థాపక అధ్యక్షుడు మంజునాథ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలన్నారు. అప్పుడే లక్ష్యాలను చేరకోగలరని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కరెస్పాండెంట్ ఓంకారప్ప, ట్రెజరర్ గురురాజ్, ప్రిన్సిపాల్ హనుమాన్‌ప్రసాద్, అధ్యాపకులు, తదితరులుపాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలు చేపట్టండి

● కౌన్సిల్ సమావేశంలో అధికారులను కోరిన టీడీపీ కౌన్సిలర్లు

గుంతకల్లుటౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని , దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే పారిశధ్య చర్యలపై దృష్టి పెట్టాలని టీడీపీ కౌన్సిలర్లు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం చైర్‌పర్సన్ ఎన్. భవాని అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా టీడీపీ కౌన్సిలర్లు మాట్లాడుతూ వార్డుల్లో చెత్త పదిరోజులకొకసారి మాత్రమే తొలగిస్తున్నారన్నారు. దీంతో అంతా పేరుకుపోవడంతో వీధులన్నీ అపరిశుభ్రంగా ఉంటున్నాయని, దోమలు వృద్ధి చెందుతున్నాయని వాపోయారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన చెందారు. ఇప్పటికైనా పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. తర్వాత అజెండాను మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్ చదివి వినిపించారు. అజెండాలోని అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కంది పంట పరిశీలన



కంది పంటను పరిశీలిస్తున్న ఎన్‌ఆర్‌ఐ అగ్రిటెక్ నిర్వాహకులు

గుంతకల్లుటౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ కొట్టాల గ్రామంలో రైతు సతీష్ సాగు చేసిన కంది పంటను ఎన్‌ఆర్‌ఐ అగ్రిటెక్ కంపెనీ నిర్వాహకులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ కంపెనీ ఉపాధ్యక్షుడు కే .సాంబశివరావు, రాయలసీమ రీజనల్ మేనేజర్ రమేష్ నాయుడు మాట్లాడుతూ.. ఎన్‌ఆర్‌ఐ అగ్రిటెక్ కంపెనీకి చెందిన సూర్య రకం కంది విత్తనాల వాడకం వల్ల అధిక దిగుబడి వస్తుందన్నారు. పంటసాగు చేసిన తరువాత బెట్ట పరిస్థితులను కూడా తట్టుకుంటుందన్నారు. అధికవర్షాన్ని సైతం తట్టుకుని పూత నుంచి పిందె మారడానికి తక్కువ సమయం తీసుకుంటుందని చెప్పారు. రైతులు సూర్య రకం విత్తనాలు వాడి అధిక దిగుబడి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో రేవతి, బాలాజీట్రేడర్స్, భవాని ఏజెన్సీ డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

గుత్తి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుత్తిఆర్‌ఎస్‌లోని ఎంఆర్ రోడ్డులో నివాసముంటున్న ఆటో డ్రైవర్ గోవిందు(40) శనివారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నాడు. గోవిందు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

గుత్తి రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతాపల్లిగ్రామానికి చెందిన యువతి కవిత (18) చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. కవితగత కొన్నేళ్లుగా కడుపు నొప్పితో భద పడుతుండేది. పలు చోట్ల చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె ఈ నెల 9న ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషపు ద్రావకం తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. బంధువులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. 10 రోజులు మృత్యువుతో పోరాడి శనివారం రాత్రి మృతి చెందింది. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పారదర్శకంగా వరి కొనుగోలు: ఆర్డీఓ

కణేకల్లు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా రైతుల నుంచి వరికొనుగోలు పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ వసంతబాబు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ భారతి సొసైటీలో శనివారం ఆయన వరికొనుగోలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వరి విక్రయానికి రైతులు పేర్లు నమోదు చేసుకున్నప్పటి నుంచి జరుగుతున్న విషయాలను ఆరాతీశారు. అలాగే రైతులు సొమ్ము కోసం వేలిముద్ర వేసినప్పటి నుంచి 48 గంటల్లో వారి ఖాతాలో సొమ్ము జమ అవుతున్న విషయాలను తెలుసుకున్నారు. తర్వాత మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు పారదర్శకంగా సాగుతున్నట్లు చెప్పారు. కారక్రమంలో తహసీల్దార్ ఫణికుమార్, సొసైటీ అధికారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గణితంలో రాణించాలి

● విద్యార్థులకు విప్ కాలువ శ్రీనివాసులు సూచన
● శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఘన నివాళి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గంరూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి గణితంలో రాణించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని కళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విప్ కాలువ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత మాట్లాడుతూ గణిత మేధావి, అద్భుత ప్రజ్ఞావంతుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని జాతీయ గణితదినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఆయన గణితంలో చేసిన కృషి ఎనలేనిదన్నారు. ప్రతి విద్యార్థి గణితంలో రాణించాలన్నారు. అప్పుడే ఉద్యోగావకాశాలు మెండుగా లభిస్తాయని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అధ్యాపకులు గురుమూర్తి, కిరణ్, ప్రసాద్, విజయ్‌కుమార్‌బాబు, నారాయణ, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శ్రీనివాస రామానుజం జయంతి సందర్భంగా మ్యాథమ్యాటిక్స్ టాలెంట్ టెస్టును నిర్వహించారు. పది, ఇంటర్ విద్యార్థులకు టెస్ట్ నిర్వహించగా ఇందులో పలువురు ప్రతిభ కనబరిచారు. వారికి కళాశాల యాజమాన్యం బహుమతులను అందజేశారు. జిల్లా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి , కరెస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ఎండీ రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్, గణిత విభాగం ఆచార్యులు శాంతి, హరిప్రియ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని వివేకానంద పబ్లిక్ హైస్కూల్‌లో గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అకాడమిక్ చైర్మన్ నరసింహాచారి మాట్లాడుతూ అన్ని శాస్త్రాలకు గణితమే ఆధారమైందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వన్నూరుస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కసాపురం పోలీస్ స్టేషన్ తనిఖీ



కసాపురం ఆలయంలో స్వామిని దర్శించుకుంటున్న ఎస్పీ జగదీష్

గుంతకల్లు టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కసాపురం పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ జగదీష్ శనివారం తనిఖీ చేశారు. ముందుగా కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించారు. అక్కడ అర్చకులు ఘన స్వాగతం పలికి స్వామిదర్శనం చేయించి అర్చనలు జరిపారు. అనంతరం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి పరిసరాలను, లాకర్‌గదులు, రికార్డులను పరిశీలించారు. తర్వాత డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసి గుంతకల్లు సబ్ డివిజన్ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మహిళల భద్రత విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చోరీల నివారణకు చర్యలు తీసుకుని రికవరీలను పెంచాలన్నారు. మట్కా, పేకాట వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు గట్టిగా పనిచేయాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలపై నిఘా పెంచాలన్నారు. సైబర్ మోసాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు, శివారు కాలనీల్లో డ్రోన్లు ఎగురవేసి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట చేయాలని సూచించారు. డీఎస్పీ ఏ శ్రీనివాస్, ఎస్పీ సీసీ ఆంజనేయప్రసాద్, సబ్ డివిజన్ సీఐలు మనోహర్, మస్తాన్, ప్రవీణ్‌కుమార్, చిన్నగౌస్, మహానంది, రాజు, వెంకటేశ్వర్లు, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ క్వార్టర్స్ స్థలం పరిశీలన

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న పోలీస్ క్వార్టర్స్‌ను, స్థలాన్ని ఎస్పీ జగదీష్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సర్వేనెంబర్ 496లో 4.89ఎకరాల పోలీస్ క్వార్టర్స్ స్థలం ఆక్రమణకు గురైందని, సర్వేచేయించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, వీఆర్వో సురేంద్ర, టౌన్‌ప్లానింగ్ అధికారి మారుతిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మాయిలను వేధిస్తే తాట తీస్తాం : సీఐ



కోన సర్కిల్‌లో పోలీసుల పహారా

ఆంధ్రజ్యోతి స్పందన

యాడికి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే అమ్మాయిల వెంటపడి వేధింపులకు గురిచేసే పోకిరీల తాట తీస్తామని సీఐ ఈరన్న హెచ్చరించారు. మండలకేంద్రంలోని పలు ప్రధాన సర్కిళ్లల్లో శనివారం పోలీసు సిబ్బంది ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. బడిదావలో పోకిరీలు శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనానికి పోలీసులు స్పందించారు. యాడికిలోని పలు పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే దారిలో ప్రధాన సర్కిళ్లలో పోకిరీలపై పోలీసులు నిఘాపెట్టారు. ప్రతి పాఠశాల వద్దకు పోలీసు సిబ్బంది వెళ్లి బాలికల సమస్యలపై ఆరాతీశారు. పోకిరీలపై నిఘాను సీఐ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోకిరీలపై ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. ఎవరైనా వేధింపులకు పాల్పడితే తాట తీస్తామని హెచ్చరించారు. విద్యార్థినులను ఎవరైనా వేధిస్తున్నట్లు తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



చెక్కును అందజేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్

పెద్దవడుగూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టిపాడు గ్రామానికి చెందిన శివకేశవ అనే వ్యక్తి అదాని సిమెంట్ ఫ్యాక్టరీలో ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణశర్మ శనివారం ఆ గ్రామానికి వెళ్లి మృతుడి భార్య గీతకు లక్షరూపాయల చెక్కును అందజేశారు. తహశీల్దార్ ఉషారాణి, రెవెన్యూ అధికారి సుదర్శన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

జగన్ జన్మదిన వేడుకలకు కార్యకర్తలు కరువు

డీ.హీరేహాళ్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత వైఎస్ జగన్ జన్మదిన వేడుకలకు మండలంలో కార్యకర్తలు కరువయ్యారు. శనివారం వేడుకలు జరపగా ఇకరిద్దరూ తప్ప మిగతావారెవరూ పాల్గొనలేదు. గతంలో వేడుకలకు వందలాది మంది పాల్గొని ఘనంగా నిర్వహించేవారు. వైసీపీ అధికారం కోల్పోయిన తర్వాత జగన్ మొదటిసారి జన్మదిన వేడుకలు నిర్వహించుకున్నారు. ఈ సారి మండల కేంద్రంలో నిర్వహించిన వేడుకలకు పట్టుమని పదిమంది కూడా లేరు. దీంతో తూతూమంత్రంగా నిర్వహించారు. మండలవ్యాప్తంగా 16 గ్రామపంచాయతీలు, 31 గ్రామాలుండగా 80 శాతం పైగా సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీ వైసీపీకి చెందిన వారే ఉన్నారు. కానీ శనివారం నిర్వహించి జగన్ జన్మదిన వేడుకలకు ఒకరిద్దరు ప్రజాప్రతినిధులు తప్ప మిగతావారెవరూ పాల్గొనకపోవడం గమనార్హం. గత పదేళ్లపాటు వైసీపీకి సంబంధించిన అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే ఒక వర్గం నాయకులు గత నాలుగునెలలుగా పార్టీకి దూరంగా ఉండటంతోనే ఈ పరిస్థితి నెలకొందని చర్చించుకుంటున్నారు.

పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి


బెళుగుప్ప, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక పరిజ్ఞానంతో యాజమాన్య పద్ధతులు పాటిస్తే వ్యవసాయ రంగం లాభసాటిగా వుంటుందని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరమ్మ, శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మండలంలోని తగ్గుపర్తిలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో వారు మాట్లాడారు. శాస్త్రవేత్తలు చెన్నరాయుడు, నాగరాజు, బాలాజీ నాయక్, హరిణి, మల్లికార్జున రైతులు పాల్గొన్నారు.

పంట నమోదు చేయిస్తేనే ప్రభుత్వ రాయితీలు

బెళుగుప్ప : రైతులు తాము సాగు చేసిన పంటలకు ఈ క్రాప్ నమోదు చేయిస్తేనే ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. మండలంలోని దుద్దేకుంటలో శనివారం ఆమె పప్పుశనగ పంటను పరిశీలించి ఈ క్రాప్ బుకింగ్ నమోదును తనిఖీ చేశారు. రైతులకు అవగాహన కల్పించి సాగుచేసిన పంటలన్నింటిని పంట నమోదు చేయించాలని ఏవో పృథ్వీసాగర్‌కు సూచించారు. మాజీ వైస్ ఎంపీపీ తిమ్మప్ప, రైతు పెద్దన్న, ఏఈవో భాగ్యశ్రీ, సచివాలయ అధికారి అర్చన పాల్గొన్నారు.

జీడిపల్లి రిజర్వాయర్ మరువ

బెళుగుప్ప, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు ఔట్‌ఫ్లో తగ్గడంతో రెండు రోజుల నుంచి మరువ పారుతోంది. పీఏబీఆర్‌కు మరువ ద్వారా 469 క్యూసెక్కులు వెళుతున్నట్లు హంద్రీనీవా అధికారులు శనివారం తెలిపారు. ఇన్‌ఫ్లో 584 క్యూసెక్కులు ఉండగా.. ప్రస్తుతం 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉందని వెల్లడించారు.



మరువ పారుతున్న రిజర్వాయర్

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

తాడిపత్రి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృష్ణాపురం 4వరోడ్డుకు చెందిన నారాయణ కుటుంబానికి ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం రూ.48వేలు ఆర్థికసాయం అందించినట్లు అధ్యక్షుడు గుర్రప్ప తెలిపారు. నారాయణ కుమారుడు ఎంబీబీఎస్ చివరి సంవత్సరం చదువుతున్న గోపీకృష్ణ రోడ్డుప్రమాదంలో మృతి చెందాడన్నారు. వారి కుటుంబానికి అండగా సంస్థ తరపున ఈ ఆర్థికసాయం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, కన్వీనర్ నారబోయిన శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగభూషణరావు, ఉపాధ్యక్షుడు కుమారస్వామి పాల్గొన్నారు.

దాడికేసులో ఒకరి అరెస్టు

తాడిపత్రి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యాసిన్‌వలి దర్గా సమీపంలో గత అక్టోబరు 2వ తేదీన జరిగిన దాడికేసుకు సంబంధించి శనివారం దాదాపీర్‌ను అరెస్టు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. దాదాపీర్, నూర్, వట్టి వేణు పాతకక్షల కారణంగా తోళ్ల మాబుపై దాడిచేశారన్నారు. బాధితుడి ఫిర్యాదుమేరకు దాదాపీర్‌ను అరెస్టు చేశామన్నారు. మరో ఇద్దరిని అరెస్టు చేయాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

మేడికుర్తిలో ఘర్షణ

యల్లనూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడికుర్తి గ్రామంలో శనివారం మధ్యాహ్నం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. టీడీపీకి చెందిన రామకృష్ణారెడ్డి బుచ్చక్క దేవాలయానికి విద్యుత్‌లైన్లు ఏర్పాటు చేస్తుండగా.. సర్పంచు వర్గీయుడు గోపాల్‌రెడ్డి మరికొంతమంది వచ్చి అడ్డు తగిలారు. ఈ విషయంలో ఇరువర్గాలు గొడవపడ్డారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రామకృష్ణారెడ్డి తెలిపారు.

రోడ్డు పనుల పరిశీలన

పెద్దపప్పూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చుకోట గ్రామం మీదుగా వెళుతున్న నేషనల్‌హైవే 544డి రోడ్డు పనులను తహసీల్దార్ బాలాజీ రాజు శనివారం పరిశీలించారు. అనంతరం అక్కడి గ్రామస్థులతో చర్చించారు. రోడ్డుకు భూములు కోల్పోయిన రైతులు తమకు నష్టపరిహారం అందజేయాలని వినతిపత్రం ఇచ్చారు. ఆర్‌ఐ ప్రసన్నకుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తాడిపత్రి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అం బా భవానీవీధి, జింకావారివీధిలోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అబ్జర్వర్ కన్నబాబు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్‌లిస్టులో పేర్లు సరిగా ఉన్నాయా అని బీఎల్వోలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో గుత్తి, గుంతకల్లు, అనంతపురం అధికారులతో సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీలో తాగునీరు, అండర్‌డ్రైనేజీ తదితర అంశాలపై చర్చించారు. త్వరలో వేసవి రానున్నందున ప్రజలు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు పడకుండా ముందు జాగ్రత్తలు చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు. ఆయన వెంట ట్రైనీ కలెక్టర్ వినూత్న, ఆర్డీఓ కేశవనాయుడు, తహశీల్దార్ రజాక్‌వలి, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు.

స్టార్టర్లు, వైర్లు చోరీ

పామిడి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పామిడి స్టేషన్ గ్రామ సమీపాన గల వ్యవసాయ పొలాల్లో స్టార్టర్లు, వైర్లను శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధిత రైతుల సమాచారం మేరకు... ఎద్దులపల్లి రోడ్డులోని పలు పొలాల్లో పంటల సాగుకు వినియోగించే విద్యుత్ మోటార్లకు సంబంధించిన స్టార్టర్లను, వైర్లను దుండగులు దొంగలించారు. ఉదయాన్నే పొలాలకు నీరు పెట్టేందుకు వెళ్లి చూడగా స్టార్టర్లు వైర్లు చోరీకి గురైనట్లు బాధిత రైతులు పెద్దకుళ్లాయి, శ్రీనివాసులు, మల్లి, కొండన్న వాపోయారు. ఒక్కొక్క రైతుకు రూ. 7వేలు నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. ప్రతి నెలా స్టార్టర్లు, వైర్లు చోరీకి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఈ సారి ఫిర్యాదు సైతం చేయలేదని వారు తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ

పెద్దవడుగూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో టీడీపీ , వైసీపీ సానుభూతిపరుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. చిన్నవడుగూరు గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరుడు దివాకర్‌రెడ్డి, వైసీపీకి చెందిన మధుసూదన్‌రెడ్డి మండలకేంద్రంలోని ఆంధ్రా బ్యాంక్ సమీపంలో శనివారం మాటా మాటా అనుకొని గొడవపడ్డారు. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఆంజనేయులు సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిన్న బలపంపల్లి లో వైద్యసిబ్బంది పర్యటన

ఆంధ్రజ్యోతి స్పందన

శెట్టూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ములకలేడు పంచాయతీ చిన్న బలపంపల్లిలో ప్రజలు డెం గీ బారిన పడుతుండడంతో శనివారం ఆంధ్రజ్యోతిలో ముగ్గురికి డెంగీ అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన శెట్టూరు ప్రభుత్వాస్పత్రి వైద్యులు, సచివాలయ సిబ్బంది వెంటనే గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ నీరు నిల్వ వున్న చోటా అబేట్ స్ప్రే చేయించారు. సబ్‌యూనిట్ అధికారి తిరుపాలయ్య, పంచాయతీ సెక్రటరీ తిప్పేస్వామి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఏటిగడ్డ ఆంజనేయస్వామి

తాడిపత్రి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ఏటిగడ్డ వెలసిన సాల గ్రామ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే అర్చకులు స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేసి పూజలు జరిపారు. సాలగ్రామ ఆంజనేయస్వామిని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి దర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ అభివృద్ధి కోసం తనవంతు సాయం అందిస్తానని హామీ ఇచ్చారు.

రాయదుర్గంరూరల్: మండలంలోని వజ్రవన్నూరు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి , మల్లాపురం సమీపంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరగాయి. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిదర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు పొందారు.

భూమి కేటాయించి న్యాయం చేయండి

● రెవెన్యూ సదస్సులో దంపతుల వేడుకోలు

యాడికి, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): దళితులమైన మాకు భూమి కేటాయించాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినా అప్పటి ఎమ్మెల్యే పెద్దారెడ్డి కేటాయించకుండా అడ్డుకున్నారని, ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరుతూ కోనుప్పలపాడు గ్రామానికి చెందిన ఓబన్న, రత్నకుమారి దంపతులు శనివారం రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ దంపతులు మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో తమపై ఆ పార్టీ నాయకులు దాడిచేశారన్నారు. ఈ సంఘటనకు సంబంధించి వారిపై అప్పట్లో కేసు నమోదైందన్నారు. మాకు అన్యాయం జరిగిందని అప్పటి కలెక్టర్ గంధం చంద్రుడు, ఎస్పీ సత్యయేసుబాబు గ్రామానికి వచ్చి ఆదుకుంటామని తెలిపారన్నారు. ఈ మేరకు తమకు 5ఎకరాల భూమి కేటాయించాలని అప్పట్లోనే కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. అయితే నాటి ఎమ్మెల్యే పెద్దారెడ్డి, మండలంలోని వైసీపీ నాయకులు తమకు భూమి కేటాయించకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఏఅధికారీ ఏమీ చేయలేకపోయారన్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలని వారు కోరారు.

చెట్టు పడి యువకుడి మృతి



రామమూర్తి (ఫైల్)

కుందుర్పి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలిమిపాలెం గ్రామానికి చెందిన రామమూర్తి (35) శనివారం కర్ణాటకలోని పావగడ తాలుకా కదిరేపల్లి దగ్గర ఓ పొలంలో చెట్లు కొట్టేందుకు వెళ్లాడు. అయితే అక్కడ పెద్ద వృక్షాలు కొడుతుండగా ఓ చెట్టు కూలిపోయి మీద పడింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతర కూలీలు గమనించి వెంటనే మృతదేహాన్ని కొలిమిపాలెం తీసుకొచ్చారు. మృతుడికి భార్య రాధమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కాగా ఈ ఘటనపై వారి కుటుంబ సభ్యులు గానీ, బంధువులు గానీ ఎలాంటి ఫిర్యాదులు చేయలేదని అరిసికెరె, కుందుర్పి పోలీస్ స్టేషన్ల పోలీసులు తెలిపారు.

25 మంది ఉద్యోగాలకు ఎంపిక

రాయదుర్గం టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 25 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎం శ్రీనివాసులు తెలిపారు. జాబ్‌మేళాలో స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్, ఫ్లిప్‌కార్ట్, క్రెడిట్ యాక్సెస్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. జాబ్‌మేళాకు 45 మంది అభ్యర్థులు హాజరు కాగా 25 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. పీఆర్‌డీఏ సీడ్యాప్ డీపీ ట్రైనర్ నారాయణస్వామి, కో ఆర్డినేటర్ రాము, అభ్యర్థులు పాల్గొన్నారు.

బీమా గడువు పెంపు

పుట్లూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పంటల బీమా గడువు ఈనెల 31 వ తేదీ వరకు పొడిగించినట్లు వ్యవసాయాధికారి కాత్యాయని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రబీలో సాగుచేసిన పప్పుశనగ, మొక్కజొన్న, వేరుశనగ, జొన్న తదితర పంటలకు సంబంధించి బీమా గడువును పొడిగించామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

క్రీడల్లో రాణించాలి

గుంతకల్లు టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టుదల, నిరంతర కృషితో క్రీడల్లో రాణించాలని ఆర్‌పీఎఫ్ కమాండెంట్ మురళీకృష్ణ సూచించారు. పట్టణంలోని డీఆర్‌ఎం కార్యాలయంలో శనివారం జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ఆయన అభినందించారు. మండలంలోని నక్కనదొడ్డి గ్రామానికి చెందిన వర్షిత, ఇంద్రలేఖ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలో పాల్గొని బంగారు పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. లక్ష్య సాధనతో మరింత కష్టపడి జాతీయ స్థాయిలో సత్తాచాటాలని విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో సీనియర్ డీపీఓ చౌహాన్, డీఎంఎం వెంకటేశ్వరరావు, మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు , సభ్యులు కాశీనాథ్, పురుషోత్తం పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సు

పామిడి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎద్దులపల్లి లో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల వల్ల రైతులకు భూమి సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. అనంతరం రైతులు 75 అర్జీలు ఇచ్చినట్లు తహసీల్దార్ శ్రీధరమూర్తి పేర్కొన్నారు.